VELTHURU TELUGU DAILAY

# వెలుతురు

## తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
బుధవారం 13.05.2026

సంపుటి: 07 సంచిక: 339
పేజీలు: 12 వెల: రూ. 5/

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH

Velthuru Newspaper





నేటి నుంచి ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు 2



### మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీ సివి ఆనంద్

సివి ఆనంద్ కీ శుభాకాంక్షలు తెలిపి అభినందించిన మంత్రి సీతక్క ,రాష్ట్రాన్ని జీరో క్రైమ్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని సూచించిన మంత్రి సీతక్క



### పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి.. 2

ఖైబర్ పంక్తువా లోని లక్కీ మార్వాట్ లో ఘటన

ఆటో రిక్షాతో వచ్చి ఆత్మహుతి దాడి.

8 మంది మృతి.. 35 మందికి గాయాలు..!



# ధాన్యం కొనుగోళ్లపై సీఎం సీరియస్

## కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలి

కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ వెలుతురు మే 12:

మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతి పై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి ..మిగతా 2లో

### ఎర్రవల్లి వేదికగా కేసీఆర్

# మాస్టర్ ప్లాన్..!



## బీఆర్ఎస్ ప్రక్షాళనకు శ్రీకారం..

క్రియాశీలక సభ్యులకే ప్రాధాన్యం

ఫామ్‌హౌస్‌లో 23 మంది కీలక నేతలతో కేసీఆర్ కోర్ కమిటీ సమావేశం

సంఖ్య కాదు.. పార్టీ కోసం నిలబడే కార్యకర్తలకే సభ్యత్వమని స్పష్టం చేసిన కేసీఆర్

పాత ఇంచార్జీలకు చెక్..

నియోజకవర్గాలకు కొత్త పర్యవేక్షకుల నియామకానికి నిర్ణయం

బీఆర్ఎస్‌ను మళ్లీ అధికార దిశగా నడిపేందుకు క్షేత్రస్థాయి పోరాటాలకు పిలుపు

హైదరాబాద్, మే 12 (వెలుతురు):

తెలంగాణ రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాల మధ్య బీఆర్ఎస్ పార్టీని మళ్లీ పూర్వ వైభవానికి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ అధినేత కెసిఆర్ వ్యూహాలకు పదును పెట్టారని తెలుస్తోంది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన కీలక కోర్ కమిటీ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారని సమాచారం. సుమారు 23 మంది ముఖ్య నేతలతో జరిగిన ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, క్షేత్రస్థాయి పోరాటాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గులాబీ పార్టీ బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన తర్వాత తొలిసారిగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. అయితే గతంలో మాదిరిగా ..మిగతా 2లో

## జూన్ 2న ఆదిలాబాద్ లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం

పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా క్యూర్ పరిధిలో 5 నుంచి 8 కి.మీ. పరిధి లోనే ఇందిరమ్మ ఇండ్లు

నియోజక వర్గం యూనిట్ గా స్థలాల గుర్తింపు

డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపుపై స్పెషల్ డ్రైవ్

ఈనెల చివరిలోగా హైదరాబాద్ లో ఇండ్ల స్థలాలు కలిగిన వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు

అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించేది లేదు

ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




11

## నీట్ 2026 పరీక్ష రద్దు

విద్యార్థుల భవితవ్యం కోసం కేంద్రం సంచలన నిర్ణయం

నీట్ యూజీ 2026 పరీక్షను పూర్తిగా రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ కఠిన నిర్ణయం

మే 3వ తేదీన ముగిసిన పరీక్ష.. త్వరలోనే రీఎగ్జామ్ తేదీల ప్రకటన






### విజయ్‌కు సర్కార్‌కు హైకోర్టు షాక్..

ఒకే ఒక్క ఓటుతో గెలిచిన ఎమ్మెల్యే బల పరీక్షలో పాల్గొనవద్దంటూ కోర్టు ఆదేశం..!

విజయ్ బలం ఒక ఓటు తగ్గి, 119కి చేరనుంది.

చెన్నై, మే 12 (వెలుతురు):

తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ శాసనసభలో తన బలాన్ని నిరూపించుకోవాల్సిన తరుణంలో అనూహ్య పరిణామం ఎదురైంది. ఒకే ఒక్క ఓటు తేడాతో విజయం సాధించిన టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతికి మద్రాసు హైకోర్టులో చుక్కెదురైంది. అసెంబ్లీలో జరగనున్న విశ్వాస పరీక్షలో ఆయన పాల్గొనకూడదని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ముఖ్యమంత్రి విజయ్ బలం ఒక ఓటు తగ్గనుంది.

**ఆ ఒక్క ఓటు వివాదం ఏమిటి?**

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శివగంగై జిల్లా తిరుప్పత్తూరు నియోజకవర్గం ఫలితం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ఇక్కడ టీవీకే అభ్యర్థి శ్రీనివాస సేతుపతికి 83,375 ఓట్లు రాగా.. ఆయన ప్రత్యర్థి, డీఎంకే సీనియర్ నేత పెరియ కరుప్పన్‌కు 83,374 ఓట్లు వచ్చాయి. అంటే కేవలం ఒక్క ఓటు తేడాతో సేతుపతి విజేతగా నిలిచారు. ..మిగతా 2లో



## చంచల్ గూడలో తెలంగాణ జైలు

"ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్"కు శ్రీకారం చుట్టిన గవర్నర్

శిక్ష నుంచి సంస్కరణ దిశగా జైలు వ్యవస్థ

పునరావాస కార్యక్రమాలపై ప్రత్యేక ప్రదర్శనలు

జైలు జీవితంపై అవగాహన కల్పించే కొత్త కార్యక్రమం

చట్టాల పట్ల గౌరవం పెంచే దిశగా "ఫీల్ ది జైల్"

పర్యాటక ఆకర్షణగా తెలంగాణ జైలు మ్యూజియం

ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్, మే 12 (వెలుతురు):

హైదరాబాద్ చంచల్గూడలో తెలంగాణ జైలు మ్యూజియం మరియు ప్రత్యేకమైన "ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్ / జైల్ అనుభవం" కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ జైలు మ్యూజియం ..మిగతా11లో

## నీట్ పేపర్ లీక్

ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ శర్మ



హైదరాబాద్ వెలుతురు మే 12:

భారతదేశంలో యువతి యువకులు డాక్టర్లుగా ఎదగాలనే ఏకైక లక్ష్యంతో దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు NEET పరీక్ష రాశారు. అయితే ఆ పరీక్ష పేపర్ లీక్ కావడంతో ..మిగతా11లో

## అమరావతికి కిమ్స్

నేడు భూమి పూజ చేయనున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

సీఎం చంద్రబాబు చేతులమీదుగా కార్యక్రమం

అమరావతిలో అడుగు పెడుతున్న ప్రముఖ వైద్య సంస్థ కిమ్స్ గ్రూప్



11



## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన డీజీపీ సివి ఆనంద్

హైదరాబాద్ వెలుతురు మే 12:

రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారిని మంగళవారం నాడు హైదరాబాద్ లోని వారి నివాసంలో రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర నూతన డీజీపీగా ఇటీవల నియామకమైన సీవీ ఆనంద్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. వివిధ హోదాల్లో పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మంచి పోలీస్ అధికారిగా పేరుగాంచారని, డీజీపీ గా ప్రస్తుతం చేపట్టిన నూతన బాధ్యతలను ఆదర్శవంతంగా నిర్వహించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కాంక్షించారు.




# విజయ్‌కు సర్కార్‌కు హైకోర్టు షాక్..

(మొదటి పేజీ తరువాయి)

అయితే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో భారీగా అవకతవకలు జరిగాయని, రీకౌంటింగ్ నిర్వహించాలని కోరుతూ పెరియ కరుప్పన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు.. తుది తీర్పు వచ్చే వరకు శ్రీనివాస సేతుపతి ఎమ్మెల్యేగా ఎలాంటి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనకూడదని స్పష్టం చేసింది. ముఖ్యంగా సీఎం విజయ్ ప్రవేశ పెట్టనున్న విశ్వాస తీర్మానం సమయంలో ఆయన సభకు దూరంగా ఉండాల్సిందేనని ఆదేశించింది.

**సంఖ్యాబలంపై ప్రభావం ఎంత?**

మొత్తం 234 స్థానాలు ఉన్న తమిళనాడు అసెంబ్లీలో మ్యాజిక్ ఫిగర్ సాధించడానికి 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ముఖ్యమంత్రి విజయ్ పక్షాన 120 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. తాజా కోర్టు తీర్పుతో శ్రీనివాస సేతుపతి ఓటును మినహాయిస్తే.. ఆ సంఖ్య 119కి పడిపోతుంది. అయినప్పటికీ.. విజయ్ ప్రభుత్వం గట్టెక్కడానికి అవసరమైన కనీస బలం 118 కంటే ఒకటి ఎక్కువగా ఉండటం ఆయనకు ఊరటనిచ్చే అంశం కాగా.. అదనంగా అన్నాడీఎంకేకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా విజయ్‌కు మద్దతు తెలపడం విశేషం.ఈ పరిణామం డీఎంకేకు నైతిక విజయంగా కనిపిస్తున్నప్పటికీ.. సాంకేతికంగా విజయ్ ప్రభుత్వం సురక్షితంగానే ఉంది. అయితే తిరుప్పత్తూరు రీకౌంటింగ్‌లో ఫలితం మారితే మాత్రం రాజకీయ సమీకరణాలు మరో మలుపు తిరిగే అవకాశం ఉంది.



# పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి..

కరాచీ, మే 12 (వెలుతురు):

పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఆటో రిక్షా ద్వారా జరిగిన ఈ ఆత్మాహుతి దాడిలో 8 మంది మరణించగా, 35 మందికిపైగా గాయపడ్డారు. పాకిస్తాన్ వాయువ్య ప్రాంతం, ఖైబర్ పక్తుంఖ్వా పరిధిలోని లక్కి మార్వాట్ జిల్లాలో మంగళవారం ఈ ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ప్రాంతంలో మిలిటరీ కదలికలు ఎక్కువగా ఉన్నప్పటికీ దాడి జరగడం విశేషం. అక్కడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలు పేలుడు పదార్థాలు కలిగిన ఆటో రిక్షా ఒకటి నౌరంగ్ బజార్ ప్రాంతంలోని ఫట్టాక్ చౌక్ ప్రాంతంలోకి దూసుకొచ్చి, పేలిపోయింది. ఆటోలోని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో 8 మంది మరణించగా, 35 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు కూడా ఉన్నారు. వారిలో ఒక మహిళా అధికారి కూడా ఉంది. ఘటన గురించి తెలుసుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రుల్ని స్థానిక సరాయ్ నౌరంగ్ పరిధిలోని ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించారు. బాధితుల చికిత్స కోసం అధికారులు స్థానిక ఆస్పత్రుల్లో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. దీనిలో భాగంగా వైద్యులు, సిబ్బంది సెలవులు రద్దు చేసి, వెంటనే ఆస్పత్రికి రప్పించారు. ఈ ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు. రెండు రోజుల క్రితం కూడా పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. ఒక చెక్‌పోస్ట్‌పై జరిగిన దాడిలో దాదాపు 15 మంది పోలీసులు మరణించారు.

# నేటి నుంచి ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు



హైదరాబాద్, మే 12 (వెలుతురు):

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఈ నెల 12వ తేదీ నుంచి వచ్చే విద్యా సంవత్సరానికి (2026 27) ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు జరుపుకోవచ్చు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ సోమవారం సవరించిన షెడ్యూల్‌ను జారీ చేశారు. తొలుత ఈ నెల 8వ తేదీ నుంచి ప్రవేశాలు జరుపుకొనేలా బోర్డు షెడ్యూల్ జారీ చేసింది. పాఠశాలవిద్యలో ఇంటర్ విద్యను విలీనం చేయాలని భావించిన ప్రభుత్వం ఆ షెడ్యూల్‌ను మరుసటి రోజే తాత్కాలికంగా నిలిపివేసింది. హడావిడిగా విలీనం చేయడంపై కొన్ని సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించి ఈసారికి పాత విధానంలోనే ప్రవేశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈక్రమంలో ఇంటర్‌బోర్డు సవరించిన ప్రవేశాల షెడ్యూల్‌ను సోమవారం జారీ చేసింది. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు మొదలవుతాయి.

**యాంటీ డ్రగ్ అఫిడవిట్ తప్పనిసరి**

ప్రవేశాల కోసం విద్యార్థులు ఆధార్ సమర్పించడం తప్పనిసరి. దీనితోపాటు మత్తు పదార్థాలు వినియోగించబోమని, విక్రయించబోమని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రుల నుంచి యాంటీ డ్రగ్ అఫిడవిట్ తప్పనిసరిగా తీసుకోవాలని నిబంధనల్లో స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లపై సీఎం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



**అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ**

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతీ రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచారు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

# నీట్ పేపర్ లీక్‌పై సీబీఐ ఎంక్వైరీ

న్యూఢిల్లీ వెలుతురు మే 12:

నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర నిఘా సంస్థ సీబీఐ అత్యంత చురుకుగా రంగంలోకి దిగింది. కేంద్ర విద్యాశాఖ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా సీబీఐ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మరియు 14 విదేశీ నగరాల్లో నీట్ యూజీ పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. దాదాపు 22 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో అక్రమాలు జరిగినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో ఎన్‌టీఏ మంగళవారం పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సీబీఐ అధికారులు మాట్లాడుతూ, నేరపూరిత కుట్ర, మోసం, ఇతర నేరాల కింద భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలని కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సీబీఐ అత్యంత వేగంగా స్పందించింది. రాజస్థాన్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజీ)తో సమన్వయం చేసుకుని దర్యాప్తు చేపట్టనున్నారు. త్వరలోనే సీబీఐ బృందం రాజస్థాన్‌కు వెళ్లి సమాచారం సేకరించనుంది.

**నాసిక్‌లో ఒక అరెస్టు**

నీట్ పేపర్ లీకేజీ కేసులో మహారాష్ట్రలోని నాసిక్‌లో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ పోలీసుల అభ్యర్థన మేరకు నాసిక్ క్రైం బ్రాంచ్ అతడిని అదుపులోకి తీసుకుంది. రాజస్థాన్ పోలీసుల బృందం త్వరలోనే అతడిని తమ కస్టడీలోకి తీసుకుని విచారించనుందని నాసిక్ డీసీపీ కిరణ్‌కుమార్ చౌహాన్ తెలిపారు.

2024లోనూ నీట్ పేపర్ లీక్ జరిగిన విషయం తెలిసిందే. అప్పటి కేసులను సీబీఐ ఛేదించిన నేపథ్యంలో ఈ ఏడాది కూడా సీబీఐ దర్యాప్తు చేపట్టడం గమనార్హం. లీకేజీ వెనుక ఏ కుట్ర ఉంది, ఎవరెవరు పాల్గొన్నారు, ఎలా జరిగింది అన్న అంశాలను సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తుందని అధికారులు తెలిపారు.

**విద్యార్థుల తీవ్ర ఆవేదన**

పరీక్ష రద్దు నేపథ్యంలో విద్యార్థులు తీవ్ర మానసిక వేదన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక విద్యార్థిని మాట్లాడుతూ, "చాలా బాధగా ఉంది. నేనేమీ తప్పు చేయలేదు. ఎవరో పేపర్ లీక్ చేస్తే నేను శిక్ష అనుభవిస్తున్నాను. రెండేళ్లు కష్టపడి చదివి, నా శ్రమను ధారపోశాను. మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తోంది" అని వాపోయింది. మరో విద్యార్థి "ఏడాదంతా ఎంతో కష్టపడి చదివాం. ఎన్నో నిద్రలేని రాత్రులు, కుటుంబం, హాస్టల్ ఖర్చులు అన్నీ భరించాం. చివరకు ఇలా జరిగితే బాధ ఎలా ఉంటుందో మాటల్లో చెప్పలేం" అని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అనిశ్చితి, నిరాశలో ఉన్నారు.

**వైద్య కోర్సుల ప్రవేశాలపై ప్రభావం**

నీట్ యూజీ అండర్ గ్రాడ్యుయేట్ వైద్య, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏకైక ప్రవేశ పరీక్ష. ఈ పరీక్ష రద్దు వల్ల వైద్య సీట్ల ప్రవేశాల షెడ్యూల్‌పై తీవ్ర ప్రభావం పడనుంది. కొత్త తేదీలు ఎప్పుడు ప్రకటిస్తారు, మళ్లీ లీక్ జరగకుండా ఎన్‌టీఏ ఏ చర్యలు తీసుకుంటుంది అన్నవి ప్రస్తుతం విద్యార్థుల్లో ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి.

నిపుణులు మాట్లాడుతూ, ఏన్‌టీఏ పనితీరుపై సమగ్ర సమీక్ష అవసరమని, లీకేజీలను పూర్తిగా అరికట్టడానికి ఆధునిక టెక్నాలజీ,సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు. గత సంవత్సరం లీక్ జరిగినా సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ఏడాది మళ్లీ ఇదే సమస్య తలెత్తిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ ప్రతిస్పందన**

ఈ ఘటనపై రాజకీయ పార్టీలు కూడా తీవ్రంగా స్పందించాయి. కేటీఆర్ వంటి నాయకులు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వైఫల్యంగా అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారు. కేంద్రం త్వరగా సమస్య పరిష్కరించి, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.సీబీఐ దర్యాప్తు ఫలితాలు ఎలా ఉంటాయి, లీకేజీ వెనుక ఎవరి కుట్ర ఉంది అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. అయితే ప్రస్తుతం లక్షలాది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడి, ఆందోళనలో ఉన్నారు. కేంద్రం, ఎన్‌టీఏ వారి ఆందోళనలు తీర్చి, సకాలంలో కొత్త పరీక్ష నిర్వహించి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# నీట్ 2026 పరీక్ష రద్దు




న్యూఢిల్లీ వెలుతురు మే 12:

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల కల అయిన వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియలో పెను ప్రకంపనలు రేగాయి. మే 3వ తేదీన నిర్వహించిన నీట్ యూజీ2026 ప్రవేశ పరీక్షలో భారీ అక్రమాలు, ప్రశ్నాపత్రం లీకేజీ జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారికంగా ప్రకటించింది. పరీక్ష నిర్వహణలో పారదర్శకతను కాపాడటానికి, ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడటానికే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో, త్వరలోనే కొత్త తేదీలను ప్రకటించి మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్టీఏ తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించేందుకు కేంద్రం ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించింది.

రాజస్థాన్‌లోని కోటా కేంద్రంగా ఈ ప్రశ్నాపత్రం లీకేజీ డొంక కదిలింది. అక్కడ కొన్ని కోచింగ్ సెంటర్లు విద్యార్థులకు అందించిన మెటీరియల్, అసలు పరీక్షా పత్రంలోని ప్రశ్నలతో హూబహూ పోలి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దాదాపు 600 మార్కుల విలువైన ప్రశ్నలు పరీక్షకు ముందే బయటకు వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన 120కి పైగా ప్రశ్నలు పరీక్షకు 42 గంటల ముందే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైనట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్ వెల్లడించారు. ఈ ప్రశ్నాపత్రాన్ని ఒక్కో విద్యార్థికి రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. సికార్ మరియు కోటా ప్రాంతాల్లోని కోచింగ్ సంస్థల ప్రమేయంపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నివేదికలు కేంద్ర విద్యాశాఖకు చేరడంతో, పరీక్ష నిర్వహణలో లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూ రద్దు నిర్ణయం తీసుకున్నారు.

ఈ పరీక్ష రద్దు వల్ల దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే, విద్యార్థులకు ఊరటనిచ్చేలా ఎన్టీఏ కొన్ని కీలక వెసులుబాట్లు ప్రకటించింది. ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజును విద్యార్థులకు తిరిగి రీఫండ్ చేస్తామని, మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయబోమని స్పష్టం చేసింది. ఎన్టీఏ తన సొంత వనరులతోనే రీఎగ్జామ్‌ను నిర్వహిస్తుందని, కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపింది. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి విద్యార్థులు ఆందోళన చెందవద్దని, వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఎన్టీఏ భరోసా ఇచ్చింది. సీబీఐ విచారణలో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రభుత్వం హెచ్చరించింది.నీట్ యూజీ 2026 పరీక్షను మే 3వ తేదీన పెన్‌అండ్‌పేపర్ విధానంలో దేశవ్యాప్తంగా 551 నగరాలతో పాటు విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం మొత్తం 5,400కు పైగా కేంద్రాల్లో భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ, లీకేజీ కారణంగా ఆ శ్రమంతా వృథా అయింది. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఉన్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డు పెట్టుకుని పేపర్ బయటకు రావడం అధికారులను విస్మయానికి గురి చేసింది. ఏదేమైనా, మరోసారి పకడ్బందీగా పరీక్ష నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ తక్షణ కర్తవ్యమని విద్యాశాఖ పేర్కొంది. విద్యార్థులు తమ ప్రిపరేషన్ కొనసాగించాలని, త్వరలోనే రీఎగ్జామ్ షెడ్యూల్ విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు.



# ఎర్రవల్లి వేదికగా కేసీఆర్ మాస్టర్ ప్లాన్..!

(మొదటి పేజీ తరువాయి)

కేవలం సంఖ్యల కోసం సభ్యత్వాలు నమోదు చేయడం కాదని, పార్టీ కోసం కష్టకాలంలో నిలబడే క్రియాశీలక కార్యకర్తలకే ప్రాధాన్యం ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు పార్టీకి 60 లక్షల మంది సభ్యులు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న పరిస్థితుల్లో నిజంగా పార్టీ కోసం పని చేసే వారినే గుర్తించాలని నేతలకు సూచించారు. పార్టీ జెండాను మోసే కార్యకర్తలే అసలైన బలమని పేర్కొంటూ, వారికి క్రియాశీలక సభ్యత్వం కల్పించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక పార్టీ యంత్రాంగంలో కూడా భారీ మార్పులకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పర్యవేక్షణ కోసం గతంలోలాగా పాత ఇంచార్జీలు లేదా మాజీ ఎమ్మెల్యేలపై ఆధారపడకూడదని నిర్ణయించారు. దీనికి బదులుగా రాష్ట్ర పార్టీ కార్యాలయం నుంచే నేరుగా కొత్త ఇంచార్జీలను నియోజకవర్గాలకు పంపించాలని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను నిష్పాక్షికంగా అంచనా వేయడం, గ్రూపు రాజకీయాలకు అడ్డుకట్ట వేయడం, పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశమని తెలుస్తోంది. పార్టీని మళ్లీ అధికార దిశగా నడిపించేందుకు కొత్త రక్తాన్ని నింపే ప్రక్రియలో భాగంగానే ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు కేసీఆర్ స్పష్టమైన సందేశం ఇచ్చారు. నాయకత్వం నుంచి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ ప్రజల్లో ఉండి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేటీఆర్ తో పాటు అసెంబ్లీ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. త్వరలోనే జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపాలని కేసీఆర్ నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద ఎర్రవల్లి వేదికగా జరిగిన ఈ భేటీ బీఆర్ఎస్ పార్టీలో కొత్త అధ్యాయానికి నాంది పలికినట్లుగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సామాజిక న్యాయానికి పట్టాభిషేకం

- **రేవంత్ రెడ్డి గారి 'ప్రజా పాలన'లో మహిళా కమిషన్ పునర్వ్యవస్థీకరణ**
- **డా రేఖ బోయలపల్లి., ఉపాధ్యక్షురాలు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్**

హైదరాబాద్ వెలుతురు మే 12:



తెలంగాణ రాష్ట్రంలో 'ప్రజా పాలన' అంటే కేవలం అధికారం మార్పిడి మాత్రమే కాదు, అది అణగారిన వర్గాలకు అందుతున్న గౌరవం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి నిరూపించారు. నిన్న ప్రకటించిన రాష్ట్ర మహిళా కమిషన్ కొత్త బోర్డు నియామకాల్లో కుల సమీకరణాలు పాటిస్తూ, త్యాగాలకు మరియు పార్టీ పట్ల నిబద్ధతకు పెద్దపీట వేస్తూ తీసుకున్న నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.

అనుభవానికి, నిబద్ధతకు గుర్తింపు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల్ విజయలక్ష్మి గారి నియామకం ఒక కీలక పరిణామం. హైదరాబాద్ మేయర్‌గా ఆమె చేసిన సేవలతో పాటు, దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకగా నిలిచిన సీనియర్ నాయకులు కె. కేశవరావు (కేకే ) గారి రాజకీయ వారసత్వానికి, క్రమశిక్షణకు దక్కిన గౌరవంగా దీన్ని పరిగణించవచ్చు. పార్టీని నమ్ముకున్న కుటుంబాలకు కాంగ్రెస్ ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోంది.

అమరవీరుల కుటుంబాలకు పదేళ్ల తర్వాత దక్కిన న్యాయం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ అమరవీరుల కుటుంబాలను విస్మరించగా, రేవంత్ రెడ్డి గారు బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే వారికి సముచిత స్థానం కల్పించారు.

- **కాసోజు శంకరమ్మ:**

తెలంగాణ తొలి అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ గారిని మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించి, నెలకు రూ. 3 లక్షల గౌరవ వేతనంతో ఆమె త్యాగానికి ప్రభుత్వం గౌరవం కల్పించింది.

- **చాకలి ఐలమ్మ వారసత్వం:**

బహుజన ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ గారి మనవరాలు శ్వేతను సభ్యురాలిగా నియమించడం ద్వారా బిసి వర్గాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నారు.

నిజమైన కార్యకర్తలకు భరోసా

"పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరినీ కాంగ్రెస్ గుర్తుపెట్టుకుంటుంది" అన్న మాటకు ఈ నియామకాలు నిదర్శనం.

- **నునావత్ రాధ:**

మహబూబాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా 30 ఏళ్ల సుదీర్ఘ సేవలు అందించిన రాధా గారు, ఇటీవల భర్తను కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పటికీ, ఆమె సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ పదవితో అండగా నిలిచింది.

- **సదాలక్ష్మి:**

పార్టీ గెలుపోటములతో సంబంధం లేకుండా జెండా పట్టిన సీనియర్ నాయకురాలు సదాలక్ష్మి గారికి దక్కిన ఈ అవకాశం, గ్రౌండ్ లెవల్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**ప్రజా పాలన - సామాజిక విప్లవం**

శశికళ యాదవ రెడ్డి, ఎన్. రాధా భాయ్, మరియు మైనారిటీ వర్గాల ప్రతినిధిగా ఉజ్మా అషాయ్ షకీరా వంటి వారిని నియమించడం ద్వారా అన్ని కులాలకు, మతాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమాన న్యాయం చేసింది. ఇది కేవలం బోర్డు నియామకం కాదు, గత ప్రభుత్వ వైఫల్యాలను తుడిచివేస్తూ సామాజిక న్యాయాన్ని స్థాపించిన ఒక విప్లవాత్మక అడుగు.

అధికారంలో ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజల కోసం, పార్టీ కోసం పనిచేసే వారికి రేవంత్ రెడ్డి గారి పాలనలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది అని రేఖ బోయలపల్లి వ్యక్తం చేశారు



డా రేఖ బోయలపల్లి., ఉపాధ్యక్షురాలు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్

# రైల్ రోకో కేసులో కల్వకుంట్ల కవితకు సమన్లు

- **నేడే సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం**
- **బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన కల్వకుంట్ల కవిత**
- **కవితతో పాటు మరో 12 మంది టీఆర్ఎస్ నాయకులపైనా కేసులు**

హైదరాబాద్, మే 12 (వెలుతురు):



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో రైల్ రోకో చేసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవితపై రైల్వే చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఆమెను బుధవారం ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్ లోని సెకండ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టులో హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తనపై నమోదు చేసిన కేసు వివరాలను మీడియాతో పంచుకున్నారు. 2025 నవంబర్ 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైల్ రోకో చేపట్టారు.. తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించి పంపిన బీసీ బిల్లులకు వెంటనే ఆమోదం తెలుపాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమిస్తామని తేల్చిచెప్పారు.. కల్వకుంట్ల కవితతో పాటు రైల్ రోకో చేస్తున్న టీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు కల్వకుంట్ల కవితతో పాటు టీఆర్ఎస్ నాయకులు చేపట్టిన రైల్ రోకో కారణంగా సిర్నపల్లి - ఇందల్వాయి రైల్వే స్టేషన్ల మధ్య నిజామాబాద్ నుంచి హైదరాబాద్ కు వెళ్తున్న దేవగిరి ఎక్స్ ప్రెస్ ను నిలిపివేశారు. అలాగే హైదరాబాద్ నుంచి నిజామాబాద్ రూట్ లో ప్రయాణిస్తున్న మరో గూడ్స్ రైలును నిలిపివేశారు. రైల్ రోకో చేపట్టిన కల్వకుంట్ల కవితతో పాటు మరో 12 మంది నాయకులపై కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ రవీంద్ర బాబు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ఆధారంగా కవితతో పాటు 12 మంది టీఆర్ఎస్ నాయకులపై U/Sec.147&74(a) రైల్వే యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని సికింద్రాబాద్ రైల్వేస్ సెకండ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాసెస్ కోర్టు జారీ చేసిన సమన్లలో పేర్కొన్నారు.

## తమిళనాడులో 717 మద్యం దుకాణాలు బంద్..!



- **సీఎం విజయ్ సంచలన నిర్ణయం..**

హైదరాబాద్, మే 12 (వెలుతురు):

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తనదైన ముద్ర వేస్తున్న విజయ్, తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజల శ్రేయస్సు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రార్థనా మందిరాలు, విద్యాసంస్థల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను మూసివేయాలని మంగళవారం సంచలన ఆదేశాలు జారీ చేశారు.

తమిళనాడు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం.. దేవాలయాలు, మసీదులు, చర్చిలు వంటి ప్రార్థనా స్థలాలు, పాఠశాలలు, కళాశాలలు మరియు బస్టాండ్‌లకు 500 మీటర్ల పరిధిలో ఎలాంటి మద్యం దుకాణాలు ఉండకూడదు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించిన 717 మద్యం దుకాణాలను వెంటనే మూసివేయాలని సీఎం ఆదేశించారు.

ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 4,765 తస్మాక్ (TASMAC) రిటైల్ దుకాణాలు ఉండగా, తాజా నిబంధనలతో ఈ క్రిందివి మూతపడనున్నాయి.

ప్రార్థనా స్థలాల సమీపంలో: 276 దుకాణాలు
విద్యాసంస్థల వద్ద: 186 దుకాణాలు
బస్టాండ్‌ల పరిసరాల్లో: 255 దుకాణాలు

తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (TASMAC) ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ 717 దుకాణాలను రెండు వారాల్లోగా పూర్తిగా తొలగించాలని ప్రభుత్వం స్పష్టమైన గడువు విధించింది. సీఎం విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మహిళా సంఘాలు, విద్యావేత్తల నుంచి భారీ మద్దతు లభిస్తోంది.

# హనుమాన్ జయంతి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్



- **కుటుంబ సమేతంగా రామాలయాల్లో ప్రత్యేక పూజలు**
- **రాష్ట్ర ప్రజల సుఖశాంతుల కోసం ఆంజనేయ స్వామిని ప్రార్థించిన మంత్రి**

హైదరాబాద్, మే 12 (వెలుతురు):

హైదరాబాద్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా లక్డికాపూల్ రామాలయం, సోమాజిగూడ రామాలయాలను సందర్శించి శ్రీ ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి రాష్ట్ర ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, ధైర్యం, సేవాభావానికి ప్రతీక అయిన హనుమంతుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని మంత్రి ప్రార్థించారు. అలాగే ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి అవరోధాలు కలగకూడదని స్వామివారిని కోరారు. పూజా కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరుణ, క్రమశిక్షణ, విలువలతో నర్సులు సేవలందించాలి

- **గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో దాదాపు 13 వేల పోస్టులు భర్తీ**
- **మరో 5వేల నియామక పోస్టుల ప్రక్రియ కొనసాగుతోంది..**
- **కొత్తగా 16 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు**
- **మరో 960 బీఎస్సీ నర్సింగ్ సీట్లు అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం.**
- **విదేశీ ఉద్యోగ అవకాశాల కోసం నర్సింగ్ విద్యార్థులకు జర్మన్, జపాన్ భాషలతో పాటు ఇంగ్లీష్ శిక్షణ అందిస్తున్నాం**
- **1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేసిన మంత్రి దామోదర**

హైదరాబాద్, మే 12 (వెలుతురు):



ప్రతి రోగి నమ్మకంతో ఆస్పత్రికి వస్తాడని, నర్సులు కరుణ, క్రమశిక్షణ, నైతిక విలువలతో సేవలందించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ప్రతి పౌరుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనలో నర్సులు భాగస్వాములు కావాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్లో 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మీర్జా రహ్మత్ బేగ్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం రోజునే నియామక పత్రాలు అందించడం సంతోషంగా ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన నర్సింగ్ ఆఫీసర్లకు, వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. నర్సింగ్ అనేది కేవలం వృత్తి మాత్రమే కాకుండా మానవత్వానికి చేసే గొప్ప సేవ అని పేర్కొన్నారు.

రోగులకు చికిత్సతో పాటు ధైర్యం, భరోసా, ఆశను కల్పించేది నర్సులేనని మంత్రి అన్నారు. ప్రపంచ నర్సింగ్ రంగానికి మార్గదర్శకురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, శాస్త్రీయ వైద్య సేవల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయురాలు ఆమె అని కొనియాడారు.

కోవిడ్ సమయంలో కుటుంబ సభ్యులు కూడా పేషెంట్ల వద్ద ఉండలేని పరిస్థితుల్లో నర్సులు సేవలందించారని, తెలంగాణ ప్రజలు ఆ సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో భారీ ఖాళీల వల్ల వైద్య సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి ఉండేదని, ఈ సమస్యను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని భారీ స్థాయిలో నియామకాలు చేపట్టిందన్నారు. గత రెండున్నరేళ్లలో ఆరోగ్య శాఖలో దాదాపు 13 వేల పోస్టులను భర్తీ చేసినట్లు వెల్లడించారు.

ఇప్పటికే 1257 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 623 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, 132 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఇదే వేదికపై నియామక పత్రాలు అందించినట్లు గుర్తుచేశారు. గతంలో 6956 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయగా, రెండున్నరేళ్లలో మొత్తం 9 వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేసిన ఘనత ప్రభుత్వానిదని చెప్పారు. ఇంకా దాదాపు 5 వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, అందులో సుమారు 2 వేల ఏఎన్ఎం పోస్టుల ఫలితాలను మరో ఒకటి రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. న్యాయపరమైన కారణాలతో ఆలస్యమైన 732 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీని కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు.

ప్రతి ప్రభుత్వ ఆస్పత్రి పూర్తిస్థాయి సిబ్బందితో పని చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. దేశీయ, అంతర్జాతీయ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని నర్సింగ్ విద్యను విస్తరిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో 16 కొత్త ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేసి 960 బీఎస్సీ నర్సింగ్ సీట్లను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులకు జర్మన్, జపాన్ భాషలతో పాటు ఇంగ్లీష్‌లో కూడా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అర్హులైన నర్సులకు ప్రమోషన్లు కల్పించామని, రాష్ట్రంలో ప్రస్తుతం దాదాపు 1.80 లక్షల మంది రిజిస్టర్డ్ నర్సులు సేవలందిస్తున్నారని చెప్పారు. వారి సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి కోసం ప్రత్యేక నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం మూడు మిడ్‌వైఫరీ ట్రైనింగ్ కళాశాలల్లో 90 సీట్లు మాత్రమే ఉన్నాయని, దశలవారీగా అన్ని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో మిడ్‌వైఫరీ ట్రైనింగ్ కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. దీంతో మాతాశిశు ఆరోగ్య సేవలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణకు సాగర్ నుంచి 16 టీఎంసీలు

- **శ్రీశైలం నుంచి 6 టీఎంసీలు**
- **కృష్ణా జలాల వినియోగంపై కేఆర్ఎంబీ కీలక నిర్ణయం**
- **తాగునీటి అవసరాల మేరకు మాత్రమే వాడుకోవాలి**
- **సాగర్ నుంచి ఏపీకి 10 టీఎంసీలు అనుమతి**
- **తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీలు**
- **ఆగస్టు 15 వరకు ఏపీకి పరిమితి**
- **ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడినట్లు తెలంగాణ ఆరోపణ**
- **హైదరాబాద్‌లో త్రిసభ్య కమిటీ సమావేశం**
- **ఈఎన్‌సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు**
- **నదీ జలాల పంపకంపై తీవ్ర చర్చ**
- **రైతులు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కావాలి**

హైదరాబాద్ వెలుతురు మే 12:

కృష్ణా నదీ జలాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు తమ తాగునీటి అవసరాల మేరకు మాత్రమే వినియోగించుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయించింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ ముఖ్య సమావేశంలో రెండు రాష్ట్రాల ఇంజనీరింగ్ చీఫ్‌లు (ఈఎన్‌సీలు) మరియు ఉన్నతాధికారులు పాల్గొని వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల ప్రకారం, సాగర్ రిజర్వాయర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఆగస్టు 15 వరకు 10 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవడానికి అనుమతి ఇచ్చింది. అదే సమయంలో తెలంగాణకు సాగర్ నుంచి 16 టీఎంసీలు మరియు శ్రీశైలం నుంచి 6 టీఎంసీలు వినియోగించుకోవడానికి కేఆర్ఎంబీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల్లో సమన్వయాన్ని లక్ష్యంగా చేసుకుని తీసుకోబడ్డాయి.



తెలంగాణ అధికారులు సమావేశంలో ఏపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఏపీ ఇప్పటికే తన వాటా కంటే ఎక్కువ నీటిని వినియోగించిందని, దీని వల్ల తెలంగాణ రైతులు మరియు తాగునీటి అవసరాలు దెబ్బతిన్నాయని కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై వివరణ కోరి, భవిష్యత్తులో ఇలాంటి అవకతవకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ పక్షం డిమాండ్ చేసింది.

కృష్ణా నదీ జలాల పంపకం రెండు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలిక సమస్యగా మారింది. బచ్చావత్ ట్రిబ్యునల్ అవార్డు, కృష్ణా జలాల పంపకం విషయంలో ఉన్న ఒప్పందాలు, ప్రస్తుత వాస్తవికతలను దృష్టిలో ఉంచుకుని కేఆర్ఎంబీ ఈ నిర్ణయాలు తీసుకుంది. తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయం మరియు ఇతర అవసరాల కోసం నీటిని ఆదా చేయాలని రెండు రాష్ట్రాలను కేఆర్ఎంబీ సూచించింది.

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మహానగరం సహా పలు ప్రాంతాల్లో తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో సాగర్, శ్రీశైలం జలాలను సకాలంలో, సమర్థవంతంగా వినియోగించుకోవడం అత్యంత కీలకం. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలోని గృహనిర్మాణ శాఖ కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తోంది. ఈ నేపథ్యంలో కేఆర్ఎంబీ నిర్ణయం తెలంగాణకు కొంత ఊరటనిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

ఏపీ పక్షం మాత్రం తమ రాష్ట్రంలోని తాగునీటి, వ్యవసాయ అవసరాలను పేర్కొంటూ అదనపు నీటి కోసం కేఆర్ఎంబీని కోరింది. అయితే, తెలంగాణ ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని కేఆర్ఎంబీ సమతుల్య నిర్ణయం తీసుకుంది. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో నీటి వినియోగం జరగాలని, ఏ రాష్ట్రం ఇతర రాష్ట్ర హక్కులను అతిక్రమించకూడదని బోర్డు స్పష్టం చేసింది.

ఈ సమావేశంలో నీటి మట్టాలు, నిల్వలు, వర్షపాతం, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై వివరంగా సమీక్షించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో జలాశయాలను సకాలంలో నింపుకోవడం, నీటి వినియోగంలో ఆదాతనం పాటించడం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

కృష్ణా నదీ జలాల వివాదం రెండు రాష్ట్రాల మధ్య రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలను సృష్టిస్తోంది. గతంలో జరిగిన అనేక సమావేశాలు, ట్రిబ్యునల్ తీర్పులు, సుప్రీం కోర్టు జోక్యం మధ్య కూడా పూర్తి సమస్యా పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత త్రిసభ్య కమిటీ సమావేశం కొంతవరకు ఉపశమనం కలిగించింది.

తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. అయితే ఏపీ ఎక్కువ నీరు వాడిన విషయంపై సమగ్ర నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో అలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తోంది. రైతు సంఘాలు కూడా రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చాయి.

ఈ సమస్య పరిష్కారానికి కేఆర్ఎంబీ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని, రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలను శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా నిర్ణయించాలని నిపుణులు సూచిస్తున్నారు. తాగునీటి అవసరాలతో పాటు వ్యవసాయం, పరిశ్రమల అవసరాలను కూడా సమతుల్యం చేసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# మోడీ సప్త సూచనలలో తప్పేముంది..??

## పేర్ని నాని వ్యాఖ్యలు సిగ్గుచేటు

గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రపంచం అనేక సవాలని విపత్తుని ఎదుర్కొంటుంది. 2020లో ప్రపంచం కనీవిని ఎరుగని విపత్తు కరోనాతో నష్టపోయింది లక్షలాదిమంది చనిపోయారు ఆర్థికంగా చితికిపోయింది, 2022 లో యుక్రిన్ రష్యా యుద్ధం ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది దాని ప్రభావంతో ఇంకా ప్రపంచం ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడలేదు, గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్లుగా 2020 ఆరులో ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా యుద్ధం. ఇలా ఒకటి తర్వాత ఒకటి అనేక ఇబ్బందులతో ప్రపంచం అతలాకుతలం అవుతుంది ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుంది పెట్రోల్ డీజిల్ రేట్లు ఆయా దేశాల్లో ఆకాశాన్ని అంటుతున్నాయి, ద్రవ్యోల్బణం పెరిగిపోయింది, ప్రజలు అనేకమైన ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఒకే ఒక్క దేశం భారతదేశంలో ప్రజలు ప్రశాంతంగా బతుకుతున్నారు ప్రపంచ దేశాలలో నెలకొన్న భయానక పరిస్థితులు మన దేశంలో లేవు దానికి కారణం ఒకే ఒక్కడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు.

ప్రపంచంలో నేడు నెలకొన్న అనిశ్చిత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో వచ్చే సవాలని అధిగమించటానికి నేటి నుండే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు దేశ ప్రజలకి సప్త సూచనలు చేశారు,

1. బంగారం కొనుగోలు ఒక సంవత్సరం పాటు వాయిదా వేయండి
2. విదేశీ విహార యాత్రలు కాకుండా స్వదేశీయంగా విహారయాత్రలు చేయండి
3. స్వదేశీ వస్తుల్ని వాడండి విదేశీ వస్తువుల్ని దూరం పెట్టండి
4. వంటనూనె వాడకాన్ని 10% తగ్గించి దేశ సేవతో పాటు దేహసేవ చేయండి
5. పెట్రోల్ డీజిల్ వాడకాన్ని తగ్గించండి ప్రజా రవాణా వ్యవస్థని ఉపయోగించుకోండి
6. వ్యవసాయంలో ఎరువుల వాడకాన్ని స్వల్పంగా తగ్గించి సేంద్రీయం పైన దృష్టి పెట్టండి
7. వర్క్ ఫ్రం హోం కి ప్రాధాన్యత ఇవ్వండి

ఒకపక్క దేశ ప్రజలు మహిళలు ఈ సప్త సూచనలపై సానుకూలంగా స్పందిస్తుంటే దీన్ని జీర్ణించుకోలేక కాంగ్రెస్ కమ్యూనిస్టు పిల్ల కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు అవాకులు చవాకులు మాట్లాడటం సిగ్గుచేటు. మాజీ మంత్రి వైసిపి నేత పేరుని నాని గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ట్రైన్ లోను బస్సులోను తిరగాలని ఆయనది పాటించి అప్పుడు మిగతా వాళ్ళకి చెప్పాలని ఎద్దేవా చేస్తున్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు సర్వ సంఘ పరిచర్య తన జీవితాన్ని దేశం కోసం అర్పించినటువంటి త్యాగశీలి. తన ఉఛ్వాస నిచ్వాసులు దేశం కోసం ఈ దేశ ప్రజల అభివృద్ధి కోసం. గడిచిన పాతిక సంవత్సరాలుగా గుజరాత్ ముఖ్యమంత్రిగా దేశ ప్రధానమంత్రిగా ఉంటూ తనకంటూ సొంత ఇల్లు సొంత కారు సొంత బైక్ కూడా లేనటువంటి నిరాడంబర జీవి. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఒక సాధారణ బస్సులో కూడా ప్రయాణించి సుదూర ప్రాంతంలోని ప్రజల్ని చేరుకొని సేవలందించిన వ్యక్తి. దేశ ప్రధానిగా వివిధ రైళ్లల్లో ప్రయాణిస్తూ సాధారణ ప్రజానీకాంత్ మమేకమైనటువంటి నిగర్వి. దేశ ప్రధానమంత్రిగా ఆయన భద్రత కోసం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ వ్యవస్థ ఉంటుంది. ఈ దేశం ఇద్దరు ప్రధానులని రక్షించుకోలేకపోయింది ఒక మాజీ ప్రధాని సైతం బాంబ్ బ్లాస్ట్ లో కోల్పోయాం. ప్రధాని మోడీ గారిపై అనేక హత్యాయత్నాలు జరిగాయి నిత్యం కుట్రలు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఒక సాధారణ వ్యక్తిగా ప్రధాని మోడీ గారు రైల్లో ప్రయాణం చేయటం వారి భద్రతకే కాదు వారితో ప్రయాణించే సాధారణ ప్రయాణికుల భద్రతకి కూడా ముప్పే. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయనకు వచ్చిన జీతాన్ని ఆ రాష్ట్ర పేద




బాలికల చదువు కోసం దానం చేసిన వ్యక్తి. దేశ ప్రధానిగా ఆయనకు వచ్చే బహుమతుల్ని ఆన్లైన్లో ఆప్షన్ వేసి పేద ప్రజల సంక్షేమానికి ఆ డబ్బులు విరాళంగా ఇచ్చేస్తున్నటువంటి వ్యక్తి. ఇప్పటికీ ఆయనకీ సంవత్సరానికి వచ్చే పాతిక లక్షల జీతం తప్పితే మరేమీ ఆయన దగ్గర లేదు అవి కూడా పేదలకి ఇచ్చేస్తుంటారు. పేదలకు పంచే రేషన్ బియ్యంలో డబ్బులు మింగేసిన మీరు కూడా ప్రధాని మోదీ గారిపై విమర్శలు చేయటం ఆకాశం మీద ఉమ్మేసినట్టే పేర్ని నాని గారు. ఇప్పటికైనా మీలో ఇసుమంతైన నైతికత మిగిలి ఉంటే బేషరతుగా ప్రధాని మోడీ గారికి క్షమాపణ చెప్పండి.

ఇందిరా గాంధీ గారు ప్రధానిగా ఉన్నప్పుడు బంగారం నియంత్రణ చట్టం 1968 తీసుకువచ్చి బంగారం కొనుగోలు పైన వ్యక్తిగత నిల్వల పైన ఆంక్షలు విధించారు. 1962 చైనాతో జరిగిన యుద్ధం సమయంలో ప్రధాని జవహర్లాల్ నెహ్రూ గారు బంగారం ఆభరణాలని మహిళలని విరాళంగా ఇవ్వమన్నారు. 1965లో లాల్ బహదూర్ శాస్త్రిగారు తింటానికి తిండి గింజలు దిగుమతి చేసుకోవటం ఇబ్బంది అవుతుందని ఒక పూట భోజనం మానేయమన్నారు. 1970లో ప్రధాని ఇందిరా గాంధీ గారు చపాతి పిండి దిగుమతి సుంకం పెరిగిపోయింది ఇబ్బంది అవుతుందని గోధుమపిండి చపాతీలు తినద్దని చెప్పారు. 2010 కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న శరత్ పవర్ గారు పంచదార రేట్లు పెరిగిపోయాయని అందుకే ప్రజలు పంచదార తినటం తగ్గించేయాలన్నారు. 2013లో పెట్రోల్ డీజిల్ రేట్లు పెరిగిపోతున్నాయని అంతర్జాతీయంగా ఇబ్బందులు అవుతున్నాయని భారతదేశానికి భారం ఎక్కువగా ఉందని ఆ రోజు ప్రధాని మన్మోహన్ సింగ్ గారు చెట్ల పైన డబ్బులు మొలకెత్తవని ప్రజలు పెట్రోల్ డీజిల్ వాడకాలు తగ్గించాలని కోరారు. ఇటువంటి ఘన చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ ప్రతిపక్ష నేతలు, కుహనా మేధావులు నేడు ప్రధాని మోడీ గారు చేస్తున్న సప్త సూచనలపై సర్పంలా విషం చిమ్మటం సిగ్గుచేటు.


దేశ ప్రజలు ప్రత్యేకంగా మహిళలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు చేస్తున్న సూచనలని తమ కుటుంబ సభ్యులతో చర్చిస్తున్నారు సాధ్యాసాధ్యాలపై ఆలోచన చేస్తున్నారు. నాకే మాత్రం సందేహం లేదు దేశ ప్రజలు చక్కటి నిర్ణయాలు తీసుకుని అందరూ ఆశ్చర్యపోయేలా దేశ నిర్మాణంలో భాగమవుతారు ప్రధాని మోడీ గారికి అండగా నిలబడతారు దేశ అభివృద్ధిలో తమ వంతు బాధ్యతని నిర్వర్తిస్తారు.



పెద్దిరెడ్డి రవికిరణ్,
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి,
ఆంధ్ర ప్రదేశ్

# అగ్నిగుండంలా తెలంగాణ

- వచ్చే ఐదు రోజులు జాగ్రత్త
- ఎండలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన
- తెలంగాణలో మళ్లీ ప్రతాపం చూపుతున్న భానుడు
- వచ్చే ఐదు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- ప్రజలను బెంబేలెత్తిస్తున్న ఉక్కపోత.. 40 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రతలు
- ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలో 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసిన అధికారులు
- ద్రోణి ప్రభావం తగ్గడంతో మళ్లీ పొడి వాతావరణం.. వేడిగాలుల తీవ్రత
- మే చివరి వరకు తగ్గని ఎండలు.. మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచన
- అకాల వర్షా లు, ఎండల మధ్య నలిగిపోతున్న రైతన్న
- తేమ గాలులు మాయం.. సోమవారం నుంచి పెరిగిన ఎండల తీవ్రత




హైదరాబాద్ వెలుతురు మే 12:
తెలంగాణ రాష్ట్రంలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. గత నెల రోజులుగా భానుడి భగభగలకు జనం అల్లాడిపోతుండగా, ఇప్పుడు ఎండల తీవ్రత మరింత పెరగనుందన్న వార్త ప్రజలను కలవరపెడుతోంది. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, ఎండలు తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇప్పటికే అనేక జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటేశాయి. దీనికి తోడు విపరీతమైన ఉక్కపోత తోడవ్వడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. వాతావరణ కేంద్రం అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల చివరి వరకు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం దొరుకుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్న సామాన్యులకు వాతావరణ శాఖ తాజా ప్రకటన షాక్ ఇచ్చినట్లయింది. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

గత కొద్ది రోజులుగా అక్కడక్కడ కురిసిన తేలికపాటి జల్లులు ప్రజలకు కొంత ఉపశమనాన్ని ఇచ్చాయి. సముద్రం నుంచి వచ్చిన తేమ గాలులు, ఆకాశంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల వరకు తగ్గి వాతావరణం కాస్త చల్లబడింది. అయితే, ఇప్పుడు ఆ వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ద్రోణి ప్రభావం బలహీనపడటంతో మళ్లీ పొడి గాలులు మొదలయ్యాయని, సోమవారం నుంచే ఉష్ణోగ్రతలు యధావిధిగా పెరగడం ప్రారంభమైందని అధికారులు స్పష్టం చేశారు. గాలి మళ్ళిన దిశ (విండ్ డైరెక్షన్) మారడం వల్ల వేడి తీవ్రత పెరిగిందని, దీనివల్ల ఉష్ణోగ్రతలు మళ్లీ 40 డిగ్రీల పైకి చేరుకుంటున్నాయని తెలిపారు. ఏ ప్రాంతంలోనైనా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిన వెంటనే అక్కడ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేస్తామని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొందని, రాబోయే రోజుల్లో వేడిగాలుల ప్రభావం కూడా ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది.

మరోవైపు, ఈ మారుతున్న వాతావరణం అన్నదాతలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు అకస్మాత్తుగా వచ్చే అకాల వర్షాలతో రైతులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న కోతలు పూర్తయి, ఆ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఎండ తీవ్రత వల్ల ధాన్యం త్వరగా ఆరుతుందని సంతోషపడేలోపే, ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టడం రైతులకు పెద్ద సవాలుగా మారింది. అకాల వర్షాల వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, తద్వారా మద్దతు ధర రాదేమోనని రైతాంగం ఆందోళన చెందుతోంది. అటు పగటిపూట నిప్పులు చెరిగే ఎండ, ఇటు సాయంత్రం వేళ అకాల వర్షాలతో వాతావరణంలో అనిశ్చితి నెలకొంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ భవనాల వల్ల వేడి తీవ్రత రెట్టింపుగా అనిపిస్తోంది. మే నెల చివరి వరకు ఇదే రకమైన వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ స్పష్టం చేయడంతో, అప్పటి వరకు ప్రజలు ఈ నిప్పుల కొలిమిని తట్టుకోక తప్పదు. వాతావరణంలో వచ్చే మార్పులను గమనిస్తూ ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలని ప్రభుత్వం కోరుతోంది. రాబోయే ఐదు రోజులు మాత్రం రాష్ట్రానికి అత్యంత క్లిష్టమైన రోజులుగా మారనున్నాయి.

# హనుమాన్ జయంతి ఉత్సవాలు



- పాల్గొన్న బి అర్ ఎస్ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు చీరాల రమేష్, ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కుమార్

మంచాల వెలుతురు మే12:

మంచాల మండలం హనుమాన్ జయంతి ఉత్స వాల్ల సందర్భంగా ఆరుట్ల గ్రామ పంచాయతీ పరి ధి లోని బుగ్గతండా హనుమాన్ దేవాలయం లో బుగ్గతండా గిరిజన వాసులు హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు బి అర్ ఎస్ పార్టీ నాయకుడు కాట్రోత్ వెంకటేష్ రాథోడ్ ఆధ్వ ర్యంలో బిఅర్ ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ ఆరుట్ల గ్రామసర్పంచ్ మా నిపాటి శోభా కుమార్ బు గ్గతండా గిరిజన వాసులతో కలిసి హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు ఈకా ర్యక్రమంలో ఆరుట్ల గ్రామ బిఆర్ ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వార్డు స భ్యుడు పున్నం రాము గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు కొండిగారి శ్రావణ్ కుమార్ సాతిరి స త్యం సత్యం బిఅర్ ఎస్ పార్టీ నాయకులు చిందం రఘుపతి నూతనగంటి శేఖర్ మహమ్మద్ అనీ ష్ పాషా చిందం జంగయ్య లాలగారి జంగయ్య సిద్ధగోని రమేష్ గౌడ్ సాతిరి శంకర్ శివ బుగ్గ తం డా గిరిజన నాయకులు తదితరు లుపాల్గొన్నారు

# పోక్సో కేసులో బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి...

- బాధిత కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలి.
- న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదంటూ బీఆర్ఎస్ నేతల హెచ్చరిక.
- రాజకీయ ఒత్తిళ్లతో కేసు దర్యాప్తు ఆలస్యం అవుతోందని ఆరోపణలు.
- పిల్లల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడొద్దని డిమాండ్.





శంకర్ పల్లి వెలుతురు, మే 12 :

పోక్సో కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. 17 సంవత్సరాల బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో కేసు నమోదై మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు నిందితు డిపై చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని సిటిజన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ చైర్మన్, ము న్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండిచర్ల గో వర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనాథ్ గౌడ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ బాధిత కుటుంబం మూడు రోజులుగా న్యాయం కోసం తిరుగుతున్నా పోలీసులు కేసును సీరియస్‌గా తీసుకోవడం లేదని ఆరోపించారు. రాజకీయ ప్రభావంతో బాధిత కుటుంబాన్ని బెదిరింపులకు గురి చేస్తున్నారని విమర్శిం చారు. చట్టం ముందు అందరూ సమానమైతే పోక్సో వంటి అత్యంత తీవ్రమైన కేసులో అరెస్ట్ చేయడంలో ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబా నికి పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ సంబంధాలు, ఒత్తిళ్ల కారణంగానే కేసు దర్యాప్తు నెమ్మదిగా సాగుతోందనే అనుమానా లు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఒక బాలికకు జరిగిన అన్యాయం విషయంలో మండల్, మున్సిపల్ స్థాయిలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా స్పందించి బాధిత కు టుంబానికి మద్దతు ఇవ్వాలని కోరారు. పిల్లల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రభుత్వం రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రజలు ఉద్యమాలకు సిద్ధమవుతార ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి, చెందిప్ప సర్పంచ్ మల్లికార్జున్, కౌన్సిలర్లు ఉషాకిరణ్ విజయ్ కుమార్, బానూరి కృష్ణ, మాజీ కౌన్సిల ర్ శ్రీనాథ్ గౌడ్, వడ్డే మహేష్, మాజీ సర్పంచు లు శ్రీధర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బుల్కా పూర్ మాజీ వార్డ్ సభ్యులు మల్లారెడ్డి, జులకంటి మహేందర్ రెడ్డి, అశోక్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేయాలని నాయకుల పిలుపు

కాప్రా, మే 12 వెలుతురు:

వెస్ట్ హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఏర్పడిన కమిటీకి 186 మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో ఘన సత్కార కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.నూతన కమిటీలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిం చిన నరసింహ ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మల్లేష్‌తో పాటు నాగేంద్ర రెడ్డి ఇతర కోర్ కమిటీ సభ్యులను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమం లో పలువురు నాయకులు మాట్లాడుతూ, కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, యువత భాగస్వామ్యం వంటి అంశాలలో కొత్త కమిటీ సమర్థవంతం గా పనిచేయాలని ఆకాంక్షించారు.



186 మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ మాట్లాడుతూ, వెల్ఫేర్ అసో సియేషన్లు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తాయని అన్నారు. కాలనీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న మాట్లాడుతూ, నూతన కమిటీ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందిం చాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉస్మాన్, షకీల్, భీమ్రాజ్, పాండురంగ చారి, సలీం తదిత రులు పాల్గొని కమిటీ సభ్యులకు శుభాకాం క్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్‌తో పాటు లక్ష్మణ్, నాని, అభిలాష్ మరియు పలువురు యువ నాయకులు కూడా హాజరై నూతన కమిటీకి మద్దతు ప్రకటించారు.కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగగా, కాలనీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత : కెఎం.ప్రతాప్



కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మే 12:

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కెఎం.ప్రతాప్ పేర్కొన్నారు. మంగ ళవారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి కుత్బుల్లా పూర్ గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో నెలకొని ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ భక్తమండలి ఆధ్వర్యం లో నిర్వహించిన హనుమాన్ జయంతి ఉత్సవా లకు ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్ర మాలను నిర్వహించి,అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు .ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలిగించాలని వేడుకున్నానన్నా రు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఠాకూర్ రాజేందర్ సింగ్, కుత్బుల్లాపూర్ గ్రామ సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, ఉపా ధ్యక్షులు గోపగోని నరహరిగౌడ్, కోశాధికారి రత్నం, మురళిగౌడ్, సలహాదారులు గోపాలకృ ష్ణ ఆచార్య, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, నార్ల కంటి ఎట్టయ్య, కెయల్.చారి, గౌరిగే సత్తయ్య,హనుమాన్ భక్త మండలి సభ్యులు, కుత్బుల్లాపూర్ గ్రామవాసులు తదితరులు పా ల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు ప్రత్యేక పూజల్లో

# జనసేన నాయకులు ప్రేమ కుమార్...



కూకట్ పల్లి మే 12 వెలుతురు:

అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్‌లో ని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం లో నిర్వహించిన హనుమాన్ జయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. దేవస్థానం కమిటీ చైర్మన్, సభ్యుల ఆహ్వానం మేరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కోఆ ర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్య క్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమం ముగింపులో దేవస్థానం కమిటీ సభ్యులు ప్రేమ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, బండారు ప్రసన్నాంజనేయులు, తుంగం శ్రీనివాస్ రావు, బొల్లి శ్రీనివాస్ రావు, పవన్, తుంగ రామారావు, జల్ల రవి, ఆర్. జగన్నాథం, మధు, దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాపిరెడ్డి నగర్‌లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ బస్తీ వాసుల ఆగ్రహం..

# తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా...




కూకట్ పల్లి మే 12 వెలుతురు:

కూకట్ పల్లి వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని పాపిరెడ్డి నగర్ లో అక్రమంగా కొన సాగుతున్న వాటర్ ప్లాంట్లను తొలగించి నిర్వహకులపై చర్యలు తీసుకివాలని బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి బస్తి వాసులతో కలిసి మంగళ వారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అక్రమ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నీటిని విక్రయిస్తూ నీటి సంక్షోభానికి పాల్పడుతున్న వ్యక్తులకు అధికారులు సహకరిస్తునన్నారాని ఆరో పించారు. నీటి వనరులు దోచేస్తూ అక్రమ వ్యాపారం చేస్తూన్న వ్యక్తుల కోసం బస్తి లోని ప్రజలకు నీళ్ల ఇబ్బందులను సృష్టిం చడం సబబు కాదన్నారు. ఇదే విషయమై గత కొంత కాలంగా వివిధ విభాగాల అధి కారులకు వినతులు అందిస్తూ సమస్యను పరిష్కరించాలని బస్తి వాసుల విజ్ఞపులను పక్కనపెట్టి అక్రమ వాటర్ ప్లాంట్ నిర్వా హకులకు సహకరించడం దురదృష్టకర మన్నారు. నీటి ఎద్దడికి కారణమవుతున్న వ్యక్తులపై స్థానిజ ప్రజాప్రతినిధులు, అధి కారులు చూసి చూడనట్లు వ్యవహరించ డం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బస్తి వాసుల సమస్యను గుర్తించి భూగర్భ నీటిని తోడేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్న వాటర్ ప్లాంట్లను తొలగించి సమస్యను పరిష్కరిం చాలంటూ తహశీల్దార్ కార్యాలయం సూ పర్డెంట్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ బస్తివాసు లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బుగ్గ తండాలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు

- ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలం

మంచాల వెలుతురు మే12:

మంచాల మండలం హనుమాన్ జయంతి సందర్భంగా బుగ్గతండా హనుమాన్ దేవా లయంలో జరిగిన హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని హనుమాన్ కు ప్రత్యేక పూజలు చేసిన ఆరుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ కార్యదర్శి చిందం శ్రీశైలం ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషా లతో జీవించేలా చూడాలని ఆ హనుమాన్ ని మొక్కు కున్నారు ఈ కార్యక్రమంలో ఆరుట్ల మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివా స్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్



కావాలి శ్రీనివాస్ ముదిరాజ్ (హోటల్) ఇందిర మ్మ కమిటీ సభ్యుడు బుట్టి కృష్ణ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దా సరమోని రమేష్ ముది రాజ్ బుగ్గ తండా స్థానిక గిరజన నాయకులు తదితరులు పాల్గొన్నారు




# నీట్ ఎగ్జామ్ పేపర్ లీక్ కు నైతిక బాధ్యతగా కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి రాజీనామా చేయాలి

- **బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్**

హైదరాబాద్ వెలుతురు మే 12:

ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యు.జి ఎగ్జామ్ పేపర్ లీకయ్యిందని, ఈ యేడు నిర్వహించిన పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని కేంద్ర ప్రభుత్వం 23లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడమేనని బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ అన్నారు. ఏడాది పొడవునా కష్టపడి చదివిన దాదాపు 23 లక్షలమంది విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్నారు.

రాజస్థాన్లోని సీకర్ జిల్లా ఈ లీక్ వ్యవహారానికి సెంటర్ పాయింట్ అని ఇప్పటి వరకూ జరిపిన ప్రాథమిక ఇన్వెస్టిగేషన్ ప్రకారం తేలింది. "ఎస్ కే కన్సల్టెన్సీ" నడుపుతున్న రాకేష్ మాండవారియా అనే వ్యక్తి చేతికి పరీక్షకు 15 రోజుల ముందే నీట్ పేపర్ చేరిందని తెలుస్తుంది.

2024, 2025 నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి ఇప్పటికీ గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే ఈ సంవత్సరం కూడా ఈ దుస్థితి దాపురించిందనీ వారన్నారు.

దర్యాప్తులో బయటపడ్డ అత్యంత షాకింగ్ విషయం ఏమిటంటే.. నిందితుల వద్ద దొరికిన 410 ప్రశ్నల గెస్ పేపర్లో దాదాపు 60 ప్రశ్నలు అసలు నీట్ పరీక్షలో వచ్చిన ప్రశ్నలతో అక్షరం పొల్లు పోకుండా ఉండటమే. ముఖ్యంగా కెమిస్ట్రీ 120 ప్రశ్నలలో ఎక్కువ శాతం ప్రశ్నలు నిందితులు ముందుగానే విద్యార్థులకు షేర్ చేసిన గెస్ పేపర్లో ఉన్నాయని దర్యాప్తులో బయటపడినట్లు అధికారులు తెలిపారు.

ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యతగా కేంద్ర వైద్య, ఆరోగ్య, వైద్య విద్య శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి డిమాండ్ చేస్తున్నాము.

బాధ్యులైన వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శిక్షించాలి, సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనీ బాలల హక్కుల సంక్షేమ సంఘం కోరుతుంది.



**ఇంజమూరి రఘునందన్, సెల్: 9866102962**
**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
**బాలల హక్కుల సంక్షేమ సంఘం**

# నాగోల్ కు చెందిన ఓ బ్యాంకు ఖాతాదారునికి ప్రాణ హాని ఉందంటూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను వేడుకున్న బాధితుడు దాసు


బషీర్ బాగ్ వెలుతురు 12 మే :

తన ఇంటి విషయంలో కొంతమందితో తనకు తన కుంటుంబానికి ప్రాణహాని ఉందని.ఓ సామాన్య మానవుడు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించాడు. నాగోల్ కు చెందిన తాను ఇంటి నిర్మాణం చేపట్టినట్లు. బాధితుడు దాసు కమిషన్ కు వివరించారు. అయితే ఆర్థిక అవసరాల కోసం 2014లో బ్యాంక్ లో ఇంటి లోను తీసుకుని. 2024వరకు క్రమం తప్పకుండా కట్టినట్లు వివరించారు. వ్యాపారంలో నష్టపోయి లోను కట్టడం ఆలస్యం అయ్యిందన్నారు. దీంతో బ్యాంక్ వారు రెండు కోట్ల పైన విలువ ఉన్న ఇంటిని కోటి రూపా



యలకు వేలంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా. అమ్మినట్లు తెలిపారు. అనంతరం బిడ్డర్ దుబ్బాక మహేశ్వరి, వనం రమేష్ న్యాయవాది లు ఇంటిని విడిచి వెళ్లాలని రౌడీలతో బెదిరిస్తున్నారని వాపోయారు. తనను తన కుటుంబాన్ని చంపుతానని బెదిరిస్తూ. ఇంటిపై దాడి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై నాగోల్ పోలీసులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తనకు తన కుటుంబానికి ప్రాణారక్షణ కల్పించి. ఎంతో కష్టపడి కట్టుకున్న ఇంటిని తనకు ఇప్పించాలని హెచ్చార్సీని వేడుకున్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



హైదరాబాద్ వెలుతురు మే 12:

హైదరాబాద్ నగరం తో పాటు తెలంగాణ అంతటా మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనేక హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడ్ భన్ హనుమాన్ దేవాలయం లో, కొండగట్టు హనుమాన్ దేవాలయం లో నిర్వహించిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.నాగోల్ బండ్లగూడ లో ఇంద్రప్రస్థ కాలనీ లోని హనుమాన్ దేవాలయం లో ఉదయం నుంచే హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. సనాతన దర్మం, కోసం యువత ధర్మ మార్గం లో నడువాలని పలు దేవాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో అన్న దానాలు చేశారు.

## నీట్ పరీక్ష పేపర్ (యూజీ 2026) లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్**

హైదరాబాద్ వెలుతురు మే 12:

డాక్టర్ కావాలనే ఆశతో మే 3న లక్షలాది మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాశారని ఇప్పుడు ఆ పేపర్ లీక్ వల్ల పరీక్షలు రద్దు చేస్తున్నామని జాతీయ పరీక్ష సంస్థ ప్రకటించడంతో లక్షలాది మంది విద్యార్థుల బాధ వర్ణనాతీతం అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు.రాజస్థాన్ లో జరిగిన పేపర్ లీకేజీ నిర్వాహకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ అమరవీరుల స్తూపం ఫ్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ అత్యంత కట్టుదిట్టమైన పహారాలో ఉండాల్సిన పత్రాలు ఈ విధంగా సంతలో కూరగాయలు దొరికినట్లు పేపర్లు చేతులు మారడం చాలా బాధాకరమైన విషయం అన్నారు.ఎన్నో ఆశలతో వేలకు వేల రూపాయలు ఖర్చుపెట్టి హాస్టల్లో ఉంటూ కోచింగ్ లు తీసుకొని రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థుల శ్రమ వృధా అయినట్టేనని అన్నారు.పేపర్ లీకేజీ వ్యవహారాన్ని సిబిఐ చేత ఎంక్వయిరీ చేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు రాంబాబు,లవన్ కుమార్



వెంకటయ్య,సతీషు వెంకటేష్ నవీన్ సందీప్ ప్రదీప్ గౌతమ్ శిల్ప అశ్విని స్వాతి లావణ్య సునీత సరస్వతి కుమారి మౌనిక వెన్నెల తదితరులు పాల్గొన్నారు

# నీట్ (యూజీ2026) పేపర్ లీకేజీపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి : తాటికొండ విక్రమ్ గౌడ్

హైదరాబాద్ వెలుతురు మే 12:

గతంలోనూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనలు చోటుచేసుకున్నాయి - 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు

నీట్ (యూజీ2026) పరీక్ష పేపర్ లీకేజీ ఘటన దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అత్యంత తీవ్రమైన అంశం అని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ అన్నారు. గతంలో కూడా నీట్ పరీక్ష నిర్వహణలో లోపాలు, పేపర్ లీకేజీ ఆరోపణలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైందని పేర్కొన్నారు. మళ్లీ అదే తరహా ఘటనలు చోటుచేసుకోవడం జాతీయ పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.

డాక్టర్ కావాలనే లక్ష్యంతో మే 3న దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో శ్రమించి నీట్ పరీక్ష రాశారని, ఇప్పుడు పేపర్ లీకేజీ కారణంగా పరీక్షలపై అనిశ్చితి నెలకొనడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఇది కేవలం ఒక పరీక్షా లోపం మాత్రమే కాదు, 22 లక్షల మంది విద్యార్థుల కలలు, వారి కుటుంబాల ఆశయాలపై దెబ్బ అని అన్నారు.



రాజస్థాన్‌లో జరిగిన పేపర్ లీకేజీ ఘటనకు నిరసనగా అమరవీరుల స్తూపం వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ, అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించాల్సిన జాతీయ స్థాయి పరీక్షా పత్రాలు బయటకు రావడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. గతంలో జరిగిన తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం అని విమర్శించారు.

విద్యార్థులు వేలాది రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ సెంటర్లలో చేరి, హాస్టళ్లలో ఉంటూ, రాత్రింబవళ్లు కష్టపడి చదువుతారని, ఒక పేపర్ లీకేజీ కారణంగా వారి శ్రమ అంతా వృథా కావడం బాధాకరమని అన్నారు.

ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపి, పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, భద్రంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే నిర్లక్ష్యాన్ని దేశం సహించదని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీసీ విద్యార్థి సంఘం పోరాటం కొనసాగుతుందని విక్రమ్ గౌడ్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘము జాతీయ అధ్యక్షులు కనకలా శ్యామ్ కుర్మా,కార్య నిర్వాహ అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్,పనుగంటి విజేయ్,గూడూరు భాస్కర్,నర్సింహా నాయక్ కిరణ్ గౌడ్,రాజేష్,సురేష్ ప్రజపతి..మనోజు ముదిరాజ్ మరియు బీసీ నాయకులు పాల్గొన్నారు

# మోత్కూర్ శాఖా గ్రంథాలయంలో 'డే విత్ లైబ్రరీ' ప్రారంభం.

**యాదగిరిగుట్ట, మే 11 వెలుతురు న్యూస్:**



వేసవి సెలవుల్లో తల్లి దండ్రులు తమ పిల్లల్ని సెల్ ఫోన్ కు దూరం చేసి గ్రంథాలయం లో గడిపేలా పాఠశాల విద్యార్థుల కోసం మోత్కూర్ శాఖా గ్రంథాలయం తలపెట్టిన డే విత్ లైబ్రరీ (గ్రంథాలయంలో ఒక రోజు ) కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది. తొలి రోజు ఇరవై 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తల్లి దండ్రుల నుండి డే విత్ లైబ్రరీ కార్యక్రమం పట్ల మంచి స్పందన వస్తుందని, విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని గ్రంథాలయ చైర్మన్ కోమటి మత్స్య గిరి తెలిపారు. మే 12 నుండి జూన్ 12 వరకు గ్రంథాలయ పనివేళలు ఉదయం 8:00 నుండి 11:00 గంటలకు వరకు మరియు సాయంత్రం 3:00 గంటల నుండి 6:00 గంటల వరకు విద్యార్థులు గ్రంథాలయంలో గడపాలన్నారు. ఎక్కువ రోజులు గ్రంథాలయంలో పుస్తక పఠనం పాల్గొన్న 10 మంది విజేతలకు రూ,, 2500 / నగదుతో సత్కరిస్తమన్నారు.విద్యార్థులు అధిక సంఖ్య లో పాల్గొని విజేతలు గా నిలవాలి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి ప్రవేశ రుసుము లేదన్నారు. రేపటి నుండి స్నాక్స్ కూడా అందిస్తామన్నారు. ప్రముఖులతో ప్రేరణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ వైస్ చైర్మన్ పోచం బిక్షపతి, లైబ్రరీ ఇంచార్జి చిలక మర్రి బాబు చారి తదితరులు పాల్గొన్నారు.

# బండి భగీరథను ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలి

మోత్కూర్ వెలుతురు న్యూస్ మే 12:



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను ఎందుకు అరెస్టు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కొణతం యాకుబ్ రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు పొన్నె బోయిన రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షులు జంగ శ్రీను లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బండి సంజయ్ గారు జైశ్రీరామ్ అంటూ రావణాసురుడు లాంటి కొడుకును కాపాడటానికి ప్రయత్నం చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లే అన్నారు.ఒక మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకొని లైంగికంగా దాడిచేస్తే అమ్మాయి కుటుంబం మాకు న్యాయం జరగాలని పోలీస్ స్టేషన్ లో పిర్యాదుచేస్తే పోక్సో కేసు పెట్టి వారం అవుతున్న భగీరథను అరెస్టుచేయకుండా కాలయాపన చేయడం అంటే కేసునునీరుగార్చే ప్రయత్నంచేసినట్లే అన్నారు.గతంలో ఇంతకన్నా చిన్న కేసులకే హంగామా చేసివెంటనే అరెస్టుచేసిన రేవంత్ ప్రభుత్వం ఇప్పుడెందుకు మౌనం పాటిస్తుందంటే బీజేపీ,కాంగ్రెస్ ఒకటేనని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం బండి సంజయ్ అతని కొడుకును కాపాడే ప్రయత్నం చేస్తుందని అన్నారు.అధికారాన్ని అడ్డుపెట్టుకొని అమ్మాయి కుటుంబాన్ని వేదించడం బెదిరించడాలు చేస్తే యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై బండిభగీరథను అరెస్టు చేసి శిక్ష పడేవరకు పోరాటం చేస్తారని దానికి బి.ఆర్.ఎస్.మద్దతూ పూర్తిగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంద్ మాజీ అధ్యక్షులు కొండా సోంమల్లు.మున్సిపాలిటీ ప్రధానకార్యదర్శి గజ్జిమల్లేష్. మండల బి. ఆర్. ఎస్. బీసీ విభాగం అధ్యక్షులు పానుగుల్ల విష్ణుమూర్తి. బి. ఆర్. ఎస్ నాయకులు మర్రి అనిల్ కుమార్, కూరెళ్ల పరమేష్,కూరెళ్ల రమేష్,పురుగుల మల్లయ్య,బందెల శ్రీను,పొన్నెబోయిన మచ్చగిరి,అన్నందాసు విద్యాసాగర్,సదువాసి రాజిరెడ్డి,కొంపెల్లి మల్లేష్ తదితరులు ఉన్నారు*.

# నల్గొండలో మామిడి విక్రయ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- **నల్గొండలో రెండు రోజుల పాటు మామిడి విక్రయ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ప్రత్యేక తనిఖీలు**

నల్గొండ, వెలుతురు మే 12:





వేసవి కాలంలో మామిడి పండ్ల విక్రయాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో వినియోగదారుల ఆరోగ్య రక్షణ దృష్ట్యా నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ఎన్. శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని పలు మామిడి పండ్ల విక్రయ కేంద్రాలపై రెండు రోజుల పాటు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ ఎన్‌జీఎఫ్ ఫ్రూట్ కంపెనీ, మదీనా ఫ్రూట్ మర్చంట్స్, అమీర్ ఫ్రూట్స్, హీరా ఫ్రూట్స్‌తో పాటు రోడ్డు పక్కన వ్యాపారం నిర్వహిస్తున్న విక్రేతలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా మామిడి పండ్ల మగ్గుదలకు వ్యాపారులు గోల్డ్ రైప్, ఎన్ రైప్ వంటి ఇథిలీన్ గ్యాస్ విడుదల చేసే సాచెట్లను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రతి 10 కిలోల మామిడి పండ్ల బ్యాచ్‌కు ప్లాస్టిక్ ట్రేల్లో ఇథిలీన్ సాచెట్లు ఉంచి నియంత్రిత పద్ధతిలో పండ్లను మగ్గిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా ఇథిలీన్ వినియోగం అనుమతించబడిన విధానమని పేర్కొన్నారు. తనిఖీ చేసిన అన్ని వ్యాపారులు చెల్లుబాటు అయ్యే ఫుడ్ సేఫ్టీ లైసెన్సులతో వ్యాపారం నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. ప్రజారోగ్యానికి హానికరమైన కాల్షియం కార్బైడ్ వినియోగం ఎక్కడా గుర్తించలేదని అధికారులు స్పష్టం చేశారు. కార్బైడ్ ద్వారా కృత్రిమంగా పండించిన పండ్లు ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని, అలాంటి పద్ధతులను పూర్తిగా నివారించాలని వ్యాపారులకు సూచించారు. అనుమానాస్పదంగా గుర్తించిన రెండు మామిడి పండ్ల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించి ప్రయోగశాలకు పంపించారు. పండ్లను సురక్షిత పద్ధతుల్లో మగ్గించడం, పరిశుభ్రత పాటించడం, వినియోగదారులకు నాణ్యమైన పండ్లు అందించడం వంటి అంశాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్రజలు మామిడి పండ్లు కొనుగోలు చేసే సమయంలో పండ్ల సహజ రంగు, వాసన, నాణ్యతను పరిశీలించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు సూచించారు. సహజంగా మగ్గిన పండ్లకు సహజ వాసన ఉంటుందని, అసహజంగా ప్రకాశవంతమైన రంగులో కనిపించే పండ్లపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కాల్షియం కార్బైడ్ ఉపయోగించి మగ్గించిన పండ్లు ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. ఎక్కడైనా కార్బైడ్ వినియోగం జరుగుతున్నట్లు గుర్తించినా వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## విద్యార్థులు స్వీయ రక్షణ, శారీరక దారుఢ్యం కోసం కరాటే నేర్చుకోవాలి



- **సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం.**
- **మునిపంపులలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కరాటే శిక్షణ కేంద్రం ప్రారంభం**

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 12:** మునిపంపుల గ్రామంలో భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా ఉచిత కరాటే శిక్షణ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. కరాటే వంటి యుద్ధకళలు విద్యార్థుల్లో ధైర్యాన్ని పెంచడమే కాకుండా స్వీయ రక్షణకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా శిక్షణలు అందించడం జరుగుతుందని అన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు క్రీడలు, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. భవిష్యత్తులో కూడా గ్రామంలో విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ రాచకొండ రాజు,నాయకులు తాళ్ళపల్లి జితేందర్, గంటెపాక శివ కుమార్, తొలుపునూరి చంద్రశేఖర్, బూడిద బిక్షం, జంపాల ఉమాపతి, ఆకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బోగారం గ్రామంలో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు



రామన్నపేట , మే 12,(వెలుతురు న్యూస్ ):

బోగారం గ్రామంలో హనుమాన్ గుడిలో భక్తుల హోమం పూజ అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. అన్నప్రసాద విసరణ దాత కోడి పాండునాథ్, వర్షిని దంపతులు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో భక్తులు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో భక్తులు ఆంజనేయస్వామి దేవాలయం శాశ్వత చైర్మన్ జెల్ల మార్కండేయ మాజీ సర్పంచ్ రాపోలు శివరంజని మాజీ ఉపసర్పంచ జెల్ల శ్రీనివాస్, కందగట్ల నరసింహ, కందగట్ల శ్రీనివాసులు, కూనూరు శ్రీనివాస్ గౌడ్, గండూరి వెంకటేశ్వర్లు, అంతటి మల్లేష్‌గౌడ్, జెల్ల మల్లేశం, రచ్చ ఆనంద్, జె ల్ల రఘు రాములు, శానకొండ గోపాలు, పబ్బు ధనంజయ గౌడ్, రేవతి, కృష్ణ, రచ్చ మోహన్, రాపోలు అశోక్, రాపోలు అరవిందు, కనుక రాము, కూనూరు వెంకటేష్, బొడ్డుపల్లి నవీన్, నాయిని మల్లేశం, మేడి కృష్ణ, డ్రైవర్ బడుగు శివ, బొడ్డుపల్లి రాజు, జెల్ల సుధీర్, బద్దుల మల్లేష్, కడారి శ్రీనివాస్, జెల్ల అరుణ్, కుమార్ వనం వెంకటేష్. దేవాలయం ప్రధాన అర్చకులు నిత్యానందం పంతులు, దేవాలయ సిబ్బంది, మేడి శంకరయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

## కక్కిరేణి పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం



**రామన్నపేట , మే 12,(వెలుతురు న్యూస్ ):**

మండలంలోని కక్కిరేణి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిల్లా మధురవేణి, సురేష్ పాల్గొని వారు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో 100% ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు , ఊరుకు మంచి పేరు తీసుకురావాలని వారి ప్రోత్సాహకరంగా 5000/ రూపాయలు అందజేస్తామని తెలిపారు.పాఠశాల,ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు పాల్గొని మాట్లాడుతూ విద్య పట్ల క్రమశిక్షణతో శ్రద్ధ వహించి మంచి పౌరులుగా విలువలు కాపాడుతూ వివిధ రంగాలలో ఉద్యోగాలు సాధించుటలో కృషి చేయాలని కోరారు.పదో తరగతి విద్యార్థులు మంచిగా పరీక్షలు రాయాలని ఆకాంక్షిస్తూ పాఠశాల ఉపాధ్యాయులు రాజన్ బాబు పరీక్షకు కావలసిన సామాగ్రిలను అందజేశారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి 10,000/ రెండో బహుమతి 5,000/ రూపాయలు ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి ప్రకటించారు. అలాగే 10వ తరగతి విద్యార్థులు పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్లు మరియు అంకిరెడ్డి పరుశురాం, మిరియాల రామకృష్ణ కలిసి రెండు సీలింగ్ ఫ్యాన్ లను అందజేశారు. గత జ్ఞాపకాలను నెమరు వేస్తూ విద్యార్థుల ఆట,పాట కార్యక్రమాలతో సభికులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నడిగోటి పాండు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఉపేందర్ జీ,గ్రామ పంచాయితీ కార్యదర్శి ఉమా శంకర్ ,ఏ ఏ పీసీ చైర్మన్ చిల్లా ప్రభావతి గ్రామ పెద్దలు పిట్ట రాంరెడ్డి , మదూరి సోమేశ్వర రావు ,ఉపాధ్యాయులు భద్రయ్య ,శ్రీనివాసరావు , జ్యోతి , విద్యా రాణి ,సామాజిక కార్యకర్త వేముల సైదులు ,నడిగోటి గణేష్, సింగారం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# జనగణనకు ప్రజలు సహకరించాలి



- **జనగణనకు ప్రజలు సహకరించాలి**

**మోత్కూర్, మే 12 (వెలుతురు న్యూస్):**

జనగణన ప్రక్రియలో ప్రజలు కచ్చితమైన సమాచారం అందించి జనగణనకు సహకరించాలని మోత్కూర్ తహసీల్దార్ పి. జ్యోతి కోరారు. మండల పరిధిలోని ఆనాజీపురం గ్రామంలో మంగళవారం ఛార్జ్ ఆఫీసర్ హోదాలో ఆమె, అసిస్టెంట్ ఛార్జ్ ఆఫీసర్ ఎంపీడీవో బాలాజీతో కలిసి పర్యటించి కొనసాగుతున్న జనగణన సర్వే తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను ఏ విధంగా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. సమాచార సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.జనగణన ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా, పారదర్శకంగా నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వం సేకరించే గణాంకాలు భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల వివరాల నమోదులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలు తమ వద్దకు వచ్చే సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని, అడిగిన వివరాలకు సరైన సమాచారం ఇచ్చి జనగణన ప్రక్రియ కు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుమన్, ఎంపీఎస్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: కలెక్టర్ చంద్రశేఖర్



- **రైతులను దోపిడీకి గురిచేస్తున్న మిలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **కొనుగోలు కేంద్రాలకు లారీల కొరతలేకుండా చూడాలి**
- **దడిపల్లి ప్రభాకర్ (రైతు సంఘం మండల కార్యదర్శి )**

మోత్కూర్ వెలుతురు మే 12:

కాంటాలు వేసిన దాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో రైతులను కమిషన్ల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్న మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజున మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...... గత 20 రోజులుగా కొనుగోలు కేంద్రాలలో దాన్యం రాసులు పోసుకొని, కాంటాలకోసం రైతులు ఎదురుచుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో కేంద్రానికి రోజుకు ఒకటి రెండు లారీలను మాత్రమే కేటాయించడంతో కాంటా వేసిన దాన్యం దిగుమతుల సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అకాల వర్షాలవల్ల దాన్యం తడసి నష్టపోయే ప్రమాదం ఉందని, క్వింటాలుకు మూడు కేజీల తరుగు తీస్తేనే దాన్యం దిగుమతి చేసుకుంటామని మిల్లర్లు కోర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ ఉండి, తూర్పార పట్టిన దాన్యాన్ని కాంటాలు వేసినా, ఏదో ఒక వంక పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురించేస్తున్నారని అన్నారు. ఐకేపీ కేంద్రల నిర్వాహకులు కొంతమంది మిలర్లతో కుమ్మకై కావాలనే దాన్యం ఎగుమతుల్లో జాప్యం చేస్తున్నారని, కల్లాలకు వచ్చిన రైతుల వరుస క్రమాన్ని పాటించకుండా వారికి ఇష్టం వచ్చిన వారి పేరు ముందు రాస్తూ మిగతా రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కమిషన్ల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న మిలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పిట్టల చంద్రయ్య, వెండి యాదగిరి, అంతటి పరమేష్, ముక్కముల లక్ష్మమ్మ, బద్దం విజయందర్ రెడ్డి, ముక్కాముల శేఖర్, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, తొంట అంజయ్య, కొంపల్లి శోభ తదితరులు పాల్గొన్నారు.

# మాండ్రలో కనులవిందుగా హనుమాన్ జయంతి



నార్కట్‌పల్లి వెలుతురు మే 12:

నార్కట్‌పల్లి మండలంలోని మాండ్ర గ్రామంలో మంగళవారం శ్రీ హనుమత్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు ఉత్తరపల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి, మూలవిరాట్ విగ్రహానికి సిందూర లేపనం చేశారు. అనంతరం పంచలోహ విగ్రహానికి పంచామృత అభిషేకం, నూతన పట్టువస్త్రాల సమర్పణ, ఆంజనేయ స్వామి శతనామావళి పూజ, ఆకుపూజ, గోత్రనామాలతో అర్చనలు నిర్వహించారు. మహానైవేద్యం సమర్పించి మహా హారతితో కార్యక్రమాలను ముగించారు. ఈ కార్యక్రమంలో గురిజ వీరాస్వామి, డా. వనం యాదగిరి, పున్న వాసు, గుండె దుర్గయ్య, మిర్యాల వెంకటేశం, మెట్టు రమేష్, వనం శివ, జేరిపోతుల రమేష్, దొండ మహేష్, మల్లెబోయిన నర్సింహ, కట్టగూర్ రాములు తదితరులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

కరీంనగర్ వెలుతురు మే 12:



కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో గల శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేద పండితులు తిరునగరి వెంకటాద్రి స్వామి, హర్షవర్ధన్ స్వామి ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. హనుమాన్ జన్మ దినోత్సవము సందర్భంగా ఆలయానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చిందం నరసయ్య , గడప శేఖర్ , సిరిపురం శ్రీనివాస్ , సల్ల మల్లేశం , బూట్లకరుణాకర్, రాజేంద్రప్రసాద్ , రాజిరెడ్డి , సుధాకర్ రెడ్డి, మృత్యుంజయం , కొట్టాల శ్రీనివాస్ , చిందం అంజి , చిందం మహేష్ లతోపాటు కాలనీ ప్రజలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగిరెడ్డి మృతి పట్ల బండి సంజయ్ సంతాపం

వెలుతురు తిమ్మాపూర్ మే 12 :



తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి ఎడ్ల జోగి రెడ్డి అకాల మరణం పట్ల కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు . ఎడ్ల జోగిరెడ్డి హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. తిమ్మాపూర్ మాజీ జెడ్పిటిసి ఎడ్ల భాగ్య భర్త ఎడ్ల జోగి రెడ్డి, గతంలో తిమ్మాపూర్ ఎంపీటీసీగా, తెలంగాణ ఉద్యమంలో ఎడ్ల జోగి రెడ్డి క్రియాశీలకంగా పనిచేశారు. .ప్రస్తుతము తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర నాయకునిగా, బిజెపి జిల్లా నాయకునిగా కొనసాగుతున్నారు.. తిమ్మాపూర్ మండల ప్రజలకు సుపరిచితుడైన ఎడ్ల జోగి రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. గత రెండు రోజుల క్రితం ఎడ్ల జోగిరెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఎడ్ల జోగిరెడ్డి అకాల మరణం తిమ్మాపూర్ మండలంలోబీజేపీ పార్టీకి తీరని లోటు లాంటిది. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

**సంతాపం వ్యక్తం చేసిన కరీంనగర్ బిజెపి జిల్లా శాఖ...**

బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగా డి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ లు ఎడ్ల జోగి రెడ్డి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు..

## హిందూ ఏక్తా యాత్ర సక్సెస్ చేయాలని కరపత్రాల పంపిణీ...





కరీంనగర్ వెలుతురు మే 12:

కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హనుమాన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం చేపడుతున్న హిందూ ఏక్తా యాత్ర ను విజయవంతం చేయాలని కోరుతూ కరీంనగర్ పశ్చిమ జోన్ అధ్యక్షులు జాడి బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ పశ్చిమ జోన్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి ,పశ్చిమ జోన్ ఇంచార్జ్ అడిచర్ల రాజు, బిజెపి జిల్లా సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం హనుమాన్ జయంతి పురస్కరించుకొని కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ మంగళవారం రోజున నిర్వహిస్తున్న హిందూ ఏక్తయాత్రకు హిందూ బంధువులందరూ తరలి రావాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో పశ్చిమ జోన్ ఉపాధ్యక్షులు దయ్యాల మల్లేశం ,అప్పల శ్రీనివాస్, బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు ఉదారపు విద్యాసాగర్, కాసం సంతోష్ రెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం..

- **వాహనాల గోడౌన్‌లో మంటలంటుకుని.. పలు వాహనాలు దగ్ధం**

**సంగారెడ్డి, మే 12 (వెలుతురు):**



సంగారెడ్డి జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పటాన్‌చెరులోని శ్రీరామ్ ఆటో ఫైనాన్స్‌కు చెందిన వాహనాల గోడౌన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో మూడు టిప్పర్లు, డీసీఎం, రెండు ఆటోలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**వాహనాల గోడౌన్‌లో మంటలు..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడౌన్‌లో నిల్వ ఉంచిన వాహనాల మధ్య నుంచి మంటలు వ్యాపించాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చడంతో గోడౌన్ మొత్తం దగ్ధమైంది. అక్కడ పార్క్ చేసిన పలు కార్లు పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన స్థానికులు. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. భారీ ఎత్తున పొగలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. మంటలు మరింత వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ప్రమాద కారణాలపై ఆరా..

## హిందూ ఏక్తా యాత్రకు తరలి వెళ్లిన తిమ్మాపూర్ మండల బిజెపి శ్రేణులు...

తిమ్మాపూర్ వెలుతురు మే 12:



కేంద్రమంత్రి , కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్లో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్ర కార్యక్రమానికి తిమ్మాపూర్ మండల బిజెపి శ్రేణులు తరలి వెళ్లారు. మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ,కార్యకర్తలు మహాత్మానగర్లోని శ్రీ తపాలా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ ప్రాంగణ వేదిక నుంచి కరీంనగర్ లోని వైశ్య భవన్ కు వాహనాలతో ర్యాలీగా హిందూ ఏక్తా యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ప్రతి ఏటా హిందూ ఏక్తాయాత్రను నిర్వహిస్తున్నారని తెలిపారు. హిందువుల ను సంఘటితం చేయడమే లక్ష్యంగా గత 16 సంవత్సరాలుగా హిందూ ఏక్తా యాత్ర కరీంనగర్లో ఘనంగా , ఓ గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమంగా కొనసాగుతుందన్నారు.

## ఐలన్న ఉండగా....జర్నలిస్టులకు కొండంత అండగా...

- **ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల**
- **జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశం... అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే బీర్ల**
- **మండలాల వారిగా జర్నలిస్టులతో సమావేశమై వారి సాధకబాధకాలు తెలుసుకుంటున్న బీర్ల**
- **జర్నలిస్టుల సమస్యలను అంచలంచలుగా పరిష్కరించేందుకు నడుం బిగించిన ప్రభుత్వ విప్**
- **జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్యం ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టేందుకు సిద్ధమైన ప్రభుత్వ విప్**
- **జర్నలిస్టుల సంక్షేమానికి నడుంబిగించిన బీర్ల కృషికి నియోజకవర్గ వ్యాప్తంగా అభినందనలు తెలియజేస్తున్న జర్నలిస్టులు**
- **రాష్ట్రస్థాయిలో అందరినీ ఆకర్షిస్తున్న జర్నలిస్టులతో ఎమ్మెల్యే బీర్ల ఆత్మీయ సమావేశం కార్యక్రమం**
- **ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుంటున్న ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు**
- **తమ తమ నియోజకవర్గాల్లో కూడా జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించాలన్న యోచనలో పలువురు ఎమ్మెల్యేలు..!?**

యాదగిరిగుట్ట, మే 12 వెలుతురు న్యూస్




అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇక జర్నలిస్టుల సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఇందుకోసం ఆయన జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశాల పేరిట ప్రత్యేకమైన వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా ఆలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఉన్న ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో ఆయన మమేకం కానున్నారు. ఒక్కో రోజు ఒక్కో మండలంలోని జర్నలిస్టులతో ఒక రోజంతా గడుపుతూ వారితో సమావేశమై వారి సమస్యలను సాధకబాధకాలను లోతుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయనున్నారు. ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల కోసం ఈ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని వినూత్న రీతిలో చేపట్టారు . ఇటీవల మండలాల వారీగా ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో ఆయన ప్రత్యేకంగా ఒక రోజంతా సమావేశమై వారి సాధక బాధకాలు తెలుసుకుంటున్నారు. వారి సమస్యలు వారికి ప్రభుత్వ పరంగా రావలసిన సదుపాయాల గురించి ఆరా తీసి అవి ఏ మేరకు అందుతున్నాయి ? ఇంకా ఏమేరకు అందించాలి ?అనే అంశాలపై ఆయన తీవ్రమైన కసరత్తునే చేస్తున్నారు. ప్రధానంగా జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు తన వంతుగా తన వ్యక్తిగతంగా, బీర్ల ఫౌండేషన్ తరపున కూడా జర్నలిస్టులకు పలు సంక్షేమ కార్యక్రమాలను అందించేందుకు వారికి ఆయన వ్యక్తిగతంగా సహాయపడేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆలేరు నియోజకవర్గం లోని ఆయా మండలాల వారిగా ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో ప్రత్యేకంగా సమావేశమై వారి వివరాలు తీసుకుంటున్నారు . వారితో సుదీర్ఘంగా మాట్లాడుతూ వారి సలహాలు సూచనలు తీసుకుంటూ జర్నలిస్టులకు వారి సంక్షేమానికి ఏం చేయాలి? ఏం చేస్తే బాగుంటుంది ? అనే అంశాలపై లోతుగా చర్చలు జరుపుతున్నారు. దీంతో పాటుగా ఆలేరు నియోజకవర్గంలో మరింత పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు... ప్రజలకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు ఏ విధంగా ముందుకెళ్లాలి ? అనే అంశంపై కూడా ఆయన జర్నలిస్టుల నుండి సలహాలు సూచనలు స్వీకరిస్తున్నారు. ప్రధానంగా జర్నలిస్టులకు అందాల్సిన ఇళ్ల స్థలాలు , ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్య భీమా తదితర అంశాలపై ఆయన దృష్టి కేంద్రీకరించారు. ప్రతి మండలంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భీమా అందేలా చర్యలు తీసుకునేందుకు నడుం బిగించారు . దీంతోపాటుగా తన వ్యక్తిగతంగా కూడా జర్నలిస్టులకు సహాయపడేందుకు ఆయన సుదీర్ఘమైన కసరత్తును చేస్తున్నారు. జర్నలిస్టులకు వృత్తిపరంగా ఎదురవుతున్న సాధకబాధకాలు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఆయన ప్రత్యేకమైన కృషి చేస్తున్నారు. ఈ మేరకు ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో సమావేశాలు జరుపుతున్నారు. ప్రభుత్వపరంగా వారికి లభించాల్సిన సంక్షేమ పథకాలతో పాటు తన వ్యక్తిగతంగా కూడా ఏ మేరకు..... ఏ విధంగా జర్నలిస్టులకు సహాయపడితే బాగుంటుంది ? .... అనే అంశాలపై ఆరా తీస్తున్నారు . ఆ రకంగా జర్నలిస్టులకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తన వ్యక్తిగతంగా బీర్ల ఫౌండేషన్ తరపున ప్రత్యేకంగా సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలుస్తోంది . ప్రధానంగా ఆయా మండలాలలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు కొంత సమస్యగా మారింది. కొన్ని మండలాలలో ఇప్పటికే జర్నలిస్టులకు ఇంటి స్థలాలను కేటాయించినప్పటికీ, మరికొన్ని మండలాలలో సరియైన ప్రభుత్వ స్థలం దొరకకపోవడంతో ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం పెండింగ్లో ఉంది. అటువంటి మండలాల్లో కూడా జర్నలిస్టులకు ఏదో ఒక రకంగా మంచి స్థలంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేకమైన ప్రణాళికను రూపొందించుకుంటున్నారు. ముఖ్యంగా ప్రతినిత్యం అటు ప్రభుత్వ కార్యక్రమాలతో , ఇటు పార్టీ కార్యక్రమాలతో బిజీబిజీగా గడిపే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య జర్నలిస్టులకు జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఒక రోజంతా కేటాయించి వారితో గడపడం అనే కార్యక్రమం అందరిని ఆకర్షిస్తుంది. ఇది జర్నలిస్టులకు కూడా సంతోషం కలిగిస్తోంది . నిత్యం ప్రభుత్వ ప్రజా కార్యక్రమాలతో బిజీగా ఉండే ప్రభుత్వ విప్ ఒక రోజంతా తమతో గడిపి తమ సమస్యలు సాధకబాధకాలు తెలుసుకునేందుకు నిర్ణయించడం పట్ల జర్నలిస్టు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి . ఈ కార్యక్రమం రాష్ట్రస్థాయిలో కూడా పలువురుని ఆకర్షిస్తుంది. ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూడా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేపడుతున్న కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని తమ తమ నియోజకవర్గాల్లో కూడా జర్నలిస్టుల కోసం ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది . ఏది ఏమైనప్పటికీ బీర్ల ఐలయ్య జర్నలిస్టుల కోసం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ప్రజా సంక్షేమం పట్ల ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత , చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కృషిని పలువురు అభినందిస్తున్నారు. ఇలాంటి ప్రజాప్రతినిధి పలువురికి ఆదర్శం అని పలువురు హర్షం ప్రకటిస్తున్నారు. కాగా ఒక్కో మండలంలో జర్నలిస్టులతో సమావేశమై వారి నుంచి వివరాలు తీసుకున్న తర్వాత రెండో దఫా మూడో దఫా ఇలా వీలును బట్టి జర్నలిస్టులతో తరచుగా నిరంతరం ప్రత్యేక సమావేశాలు జరిపేందుకు ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశాలు నిరంతర ప్రక్రియగా జరపాలనేది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది . దీనివల్ల ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండే జర్నలిస్టుల కు కూడా ప్రజల సమస్యలను ప్రజా ప్రతినిధులకు తెలియజేసే అవకాశం ఏర్పడుతుంది. ఇలాంటి జర్నలిస్టులతో ఆత్మీయ సమావేశాలు, సమ్మేళనం లాంటి కార్యక్రమాల వల్ల జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కావడంతో పాటు ప్రభుత్వం నుండి ప్రజలకు అందుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల తీరుతెన్నులు ఎలా ఉన్నాయి. ? ఇంకా ఎలా ఉంటే బాగుంటుంది ? ఏ విధంగా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలి... అనే అంశాలపై ప్రజాప్రతినిధులు, నేతలు జర్నలిస్టుల సలహాలు సూచనలు తీసుకునే అవకాశం కలుగుతుంది . దీంతో మరింత మెరుగైన పాలన అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో ఇటు ప్రజా ప్రతినిధులకు వివరించడంతోపాటు, ఆ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం మరింత వేగంగా పనిచేసేలా జర్నలిస్టులు కూడా ఇలాంటి సమావేశాల ద్వారా కృషి చేసే అవకాశం కలుగుతుందని పలువురి అభిప్రాయం . ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వినూత్నంగా చేపట్టిన జర్నలిస్టులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షిస్తోంది.



పుట్ట హనుమంత్
(సీనియర్ జర్నలిస్టు )

# నీట్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో చెలగాటం: మంత్రి జూపల్లి

- **పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం**
- **వరుసగా లీకేజీలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదు**



హైదరాబాద్, వెలుతురు మే 12

నీట్ పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేయాల్సిన పరిస్థితి రావడం బీజేపీ కేంద్ర ప్రభుత్వ పాలన వైఫల్యానికి నిదర్శనమని పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్య ఆశావహులను నీట్ పరీక్ష వ్యవహారం తీవ్ర ఆందోళనలోకి నెట్టిందని, ఈ మొత్తం వైఫల్యానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని కేంద్రం తన అసమర్థతతో గంగలో కలిపిందని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ముందునుంచీ హెచ్చరిస్తున్నట్లుగా, రాజ్యాంగబద్ధ సంస్థల నిర్వీర్యమే నేటి ఈ దుస్థితికి కారణమని మంత్రి స్పష్టం చేశారు. గత కొన్నేళ్లుగా నీట్ పరీక్షల్లో పేపర్ లీకేజీలు, అవకతవకలు, అక్రమాలు వరుసగా వెలుగులోకి వస్తున్నా కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత పూర్తిగా లోపించింది. ఫలితంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. తల్లిదండ్రులు ఆందోళనలో ఉన్నారు అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని, భవిష్యత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, మానసిక ఒత్తిడి దృష్ట్యా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన నిలుస్తుందని, న్యాయం చేకూరే వరకు వారికి అండగా నిలబడుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే అసమర్థతకు నిలయంగా మారిన ఎన్టీఏను తక్షణమే ప్రక్షాళన చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగ పట్ల అవగాహన కార్యక్రమం

రామన్నపేట వెలుతురు మే 12



స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రెండవ రోజు విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈరోజు విద్యార్థులకు యోగ పట్ల అవగాహన కలిగించడమే కాకుండా డిగ్రీ తర్వాత పోటీ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ యోగ ఆరోగ్యాన్ని ఎంతో మెరుగుపరుస్తుందని,జీవన విధానంలో యోగాను కూడా ఒక భాగంగా చేసుకున్నప్పుడే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. పీజీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆ పరీక్షల పట్ల కళాశాల అధ్యాపకులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత అవగాహన కలిగించారు. కార్యక్రమ ఇన్చార్జి, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఎం. రవీందర్ రావు విద్యార్థులకు,అధ్యాపకులకు యోగాసనముల పట్ల అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ సభ్యులు యం. అనిత, టి.శ్రీనివాస్,పరిపాలనాధికారి జి. కరుణాకర్, అధ్యాపకులు డాక్టర్ రత్న మంజుల, డాక్టర్ లక్ష్మీ నీలిమ, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, డాక్టర్ డి.కిషన్, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, ఎస్. బాలరాజు, జె.నరేశ్ ఎ.ఆంజనేయులు, రాధికతో పాటు కార్యాలయ సిబ్బంది కరుణాకర్ రెడ్డి, ఫయాజ్, షరీఫ్, శ్రీదేవి, రాంబాబు, కిరణ్, నవీన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో విద్యా ప్రగతి

- **ప్రతిభావంతులైన విద్యార్థులకు మంత్రి సవిత సన్మానం**
- **పదిలో ఉత్తమ మార్కులుజజ 400 మందికి పురస్కారాలు**
- **బీసీ సంక్షేమ పాఠశాలల్లో చదివితే ఉజ్వల భవిష్యత్తు**



అమరావతి వెలుతురు మే 12

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు (ఎంజేపీ) విద్యారంగంలో సంచలనాలు సృష్టిస్తున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కొనియాడారు. పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన గురుకుల విద్యార్థులను అభినందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి ఉత్తమ మార్కులు సాధించిన సుమారు 400 మంది విద్యార్థులకు మంత్రి తన చేతుల మీదుగా మెమోంటోలు, పురస్కారాలను అందజేసి సత్కరించారు. ముఖ్యంగా నంద్యాల జిల్లాకు చెందిన సాయి శ్రీ అనే విద్యార్థిని 600 మార్కులకు గాను 596 మార్కులు సాధించి గురుకులాల సత్తాను చాటిందని, ఇలాంటి విద్యార్థులే రేపటి తరానికి స్ఫూర్తి అని మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల వైపు నేడు రాష్ట్రం అంతా ఆసక్తిగా చూస్తోందని, ఇందుకు నిరంతరం శ్రమిస్తున్న ప్రిన్సిపాల్స్, సెక్రటరీస్, డైరెక్టర్ల కృషి వెలకట్టలేనిదని ఆమె కొనియాడారు.

విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మంత్రి సవిత భావోద్వేగంగా ప్రసంగించారు. "ప్రభుత్వాన్ని నమ్మి, మీ బిడ్డల భవిష్యత్తును బీసీ సంక్షేమ పాఠశాలలకు అప్పగించినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు" అని ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆశించిన విధంగానే విద్యార్థులు క్రమశిక్షణతో చదివి గొప్ప ఫలితాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. నేడు సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వారు చాలామంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవారేనని, పేదరికం చదువుకు అడ్డంకి కాదని విద్యార్థులు నిరూపించారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా రంగానికి పెద్దపీట వేసిందని, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రోజుకు 20 గంటల పాటు ప్రజల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని, ఆయన విజన్‌లో భాగంగానే బీసీ విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని మంత్రి వివరించారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై మంత్రి కీలక వివరాలను వెల్లడించారు. గత ప్రభుత్వం బకాయి పెట్టిన రూ.110 కోట్ల డైట్ బిల్లులను కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుని వెంటనే విడుదల చేసిందని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని, దోమల నుంచి రక్షణకు మస్కిటో మెష్‌లు, విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్లు, స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని, ఇందుకు సంబంధించి 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. అలాగే పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ బీసీ పాఠశాలల్లో కొత్తగా 1500 టాయిలెట్ల నిర్మాణం పూర్తి కావస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం ప్రతి ఒక్క విద్యార్థిపై ఏడాదికి సగటున రూ. 75 వేల రూపాయలు ఖర్చు చేస్తోందని, ఈ పెట్టుబడి రేపటి మేధావులను తయారు చేయడానికేనని ఆమె స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో బీసీ సంక్షేమ విద్యను మరింత విస్తరిస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎంజేపీలో కేవలం పాఠశాలలు మాత్రమే ఎక్కువగా ఉన్నాయని, విద్యార్థుల సౌకర్యార్థం కొత్తగా 6 గురుకుల కళాశాలల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని సంతోషకరమైన వార్తను పంచుకున్నారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులు పక్క ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మరిన్ని కాలేజీలను అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం కింద, ఇంట్లో ఎంతమంది బిడ్డలు చదువుకుంటున్నా అందరికీ ఆర్థిక సాయం అందిస్తామని పునరుద్ఘాటించారు. భావితరాల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఒకవైపు ప్రపంచస్థాయి రాజధానిని నిర్మిస్తూనే, మరోవైపు మానవ వనరుల వికాసానికి పెద్దపీట వేస్తోందని మంత్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధిస్తున్న గురుకుల విద్యార్థులే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అసలైన బ్రాండ్ అంబాసిడర్లు అని ఆమె ప్రసంగాన్ని ముగించారు.

# ఆమెకు పెళ్లైంది.. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మళ్ళీ చిగురించిన ప్రేమ

- **పదో తరగతి ప్రేమ.. పెళ్లి తర్వాత మళ్లీ దగ్గరైన మాజీ ప్రేమికులు..!**
- **భర్త అనుమానంతో పన్నిన కుట్ర చివరకు దారుణ హత్యకు దారి తీసింది.**
- **ఓ ప్రేమ నేర కథా చిత్రం**

హైదరాబాద్, క్రైమ్ బ్యూరో వెలుతురు మే 12




స్కూల్ రోజులలో మొదలైన ఓ ప్రేమ... కాలంతో కలిసి మసకబారిపోయిందనుకున్నారు అందరూ. కానీ సంవత్సరాల తర్వాత జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆ ప్రేమను మళ్లీ చిగురించేలా చేసింది. చివరకు ఆ అనుబంధం ప్రేమ, అసూయ, ప్రతీకారం కలిసిన రక్తపాతం కథగా మారింది. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సింగిరెడ్డిపల్లికి చెందిన అలేఖ్య, జూలా వంశీ ఇద్దరూ పదో తరగతి చదివే రోజుల నుంచే ఒకరినొకరు ఇష్టపడ్డారు. స్కూల్ ప్రేమగా మొదలైన వారి బంధం కొంతకాలం బాగానే సాగింది. కానీ జీవితంలో కొత్తగా నవీన్ ప్రవేశించడంతో పరిస్థితులు మారిపోయాయి. అలేఖ్య, వంశీకి దూరమై నవీన్‌ను వివాహం చేసుకుని హైదరాబాద్‌లో కొత్త జీవితం ప్రారంభించింది. కాలం గడిచిపోయింది. అందరూ తమ తమ జీవితాల్లో బిజీ అయ్యారు. అయితే ఇటీవల జరిగిన టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాత జ్ఞాపకాలను మళ్లీ బయటకు తీసుకొచ్చింది. చాలా రోజుల తర్వాత కలిసిన అలేఖ్య, వంశీ మళ్లీ మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా, మరింత దగ్గరితనంగా మారింది. ఇదంతా గమనించిన నవీన్‌కు అనుమానాలు మొదలయ్యాయి. భార్యను ప్రశ్నించడంతో ఇంట్లో తరచూ గొడవలు జరిగేవని తెలుస్తోంది. ఇదే సమయంలో గ్రామదేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమం కోసం అలేఖ్యనవీన్ దంపతులు స్వగ్రామానికి వచ్చారు. అక్కడే వంశీని అడ్డు తొలగించాలని నవీన్ నిర్ణయించుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. పథకం ప్రకారం ఏప్రిల్ 30న వంశీని హైదరాబాద్‌కు రప్పించాడు. తన స్నేహితుడు భాస్కర్ సహాయంతో అతనికి అధికంగా మద్యం తాగించాడు. పూర్తిగా మత్తులోకి వెళ్లిన తర్వాత కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. హత్య అనంతరం మృతదేహాన్ని కవర్లో చుట్టి కార్ డిక్కీలో తీసుకెళ్లి, మంథని సమీపంలోని గాడుదుల గండి లోయలో పడేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

వంశీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసుగా

# సనాతన ధర్మంపై మళ్లీ విషం చిమ్మిన ఉదయనిధి

- **తమిళనాడు అసెంబ్లీ వేదికగా మళ్లీ రాజకీయ రచ్చ**
- **సనాతన ధర్మంపై పాత వ్యాఖ్యల పునరుద్ఘాటన**
- **ప్రతిపక్ష నేతగా తొలి ప్రసంగంలోనే ఘాటు వ్యాఖ్యలు**




**చెన్నై మే 12 (వెలుతురు):** తమిళనాడు రాజకీయాలు మరోసారి 'సనాతన ధర్మం' చుట్టూ తిరుగుతున్నాయి. డీఎంకే యువనేత, మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతున్నాయి. ప్రతిపక్ష నేతగా తన తొలి ప్రసంగాన్ని వినిపిస్తూ, సనాతన ధర్మం ప్రజలను విభజిస్తోందని, దానిని కచ్చితంగా నిర్మూలించాలంటూ 2023 సెప్టెంబర్‌లో తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు ఆయన మళ్ళీ కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆనాడు ఈ వ్యాఖ్యల వల్ల కోర్టు కేసులు, తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, ఉదయనిధి ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన పాత వైఖరినే పునరుద్ఘాటించడం గమనార్హం. ద్రవిడ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని చాటుతూనే, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో తాము రాజీపడబోమని ఆయన తేల్చి చెప్పారు. అసెంబ్లీలో ప్రతిపక్షం ఒక నిర్మాణాత్మక శక్తిగా పనిచేయాలని, గతంలో కంటే ఇప్పుడు ప్రతిపక్షానికి బలమైన సంఖ్యా బలం ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రధానంగా ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జరిగిన ప్రోటోకాల్ తప్పిదాలను ఉదయనిధి ఎండగట్టారు. తమిళ రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాల్తు'ను కాదని, ముందుగా వందేమాతరం, జనగణమన పాడటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమిళనాడులో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమంలోనైనా రాష్ట్ర గీతానికే ప్రథమ స్థానం ఉండాలని, మన హక్కులను, సంప్రదాయాలను కాపాడుకోవడంలో రాజీ పడకూడదని హితవు పలికారు. గతంలో గవర్నర్ ఆర్.ఎన్. రవి గీతాల ఆలాపనలో మార్పులు చేయడానికి ప్రయత్నిస్తే డీఎంకే ఏ విధంగా అడ్డుకుందో గుర్తు చేస్తూ, ప్రస్తుత విజయ్ ప్రభుత్వం ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగనివ్వకూడదని హెచ్చరించారు. రాష్ట్ర గీతాన్ని పక్కన పెట్టే ఏ ప్రయత్నాన్ని డీఎంకే అనుమతించదని, ప్రజల సెంటిమెంట్లతో ఆడుకోవద్దని సూచించారు. తన ప్రసంగంలో భాగంగా ఉదయనిధి స్టాలిన్ కాస్తా చమత్కారాన్ని కూడా జోడించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, స్పీకర్ జేసీడీ ప్రభాకర్ మరియు తాను ఒకే లొయోలా కాలేజీలో చదువుకున్నామని, అందరం పూర్వ విద్యార్థులమేనని చెప్పారు. అయితే, చదువులో క్లాస్‌మేట్స్ అయినప్పటికీ, రాజకీయాల్లో మాత్రం డీఎంకే పార్టీనే సీనియర్ బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. ద్రవిడ దిగ్గజం సీఎన్ అన్నాదురై మాటలను ఉటంకిస్తూ.. ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల దిశగా సాగాలంటే ప్రతిపక్షం అనేది ఒక వాహనానికి ఉన్న బ్రేకులు లేదా ఎద్దుకు కళ్లెం లాంటిదని అభివర్ణించారు. అధికార పక్షం 'అందరికీ అన్నీ' అనే సూత్రాన్ని పాటిస్తుందో లేదో తాము నిరంతరం నిఘా ఉంచుతామని, స్పీకర్ తటస్థంగా ఉండి ప్రతిపక్షానికి తగిన అవకాశం ఇవ్వాలని కోరారు. సభలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య పెరగడం పట్ల కూడా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మరోవైపు ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఆయన మళ్లీ సనాతన ధర్మంపై ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు కూడా ఇలాంటి వ్యాఖ్యలను ద్వేషపూరిత ప్రసంగాలుగా పరిగణించిందని, అయినా ఉదయనిధిలో మార్పు రాలేదని విమర్శించారు. తమిళనాడులో డీఎంకే పరాజయం పాలైనప్పటికీ, హిందూ వ్యతిరేక ధోరణిని వీడటం లేదని, కాంగ్రెస్ వంటి మిత్రపక్షాలు కూడా దీనిని ఖండించకపోవడం దారుణమని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆరోపించారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా, ప్రతిపక్ష కూటమి నేతలకు ఇంకా జ్ఞానోదయం కాలేదని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జాతీయ స్థాయిలో మరోసారి రాజకీయ వేడిని పెంచాయి.

# సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరలు పెంచబోము

- **పర్సంటేజీ విధానం అమలు చేయాలి: తెలంగాణ ఎగ్జిబిటర్లు**
- **చిత్ర బృందాలు జీవో తెచ్చుకున్నా ధరలు పెంచను**
- **ప్రేక్షకులకు భరోసా ఇచ్చిన ఎగ్జిబిటర్ల అసోసియేషన్**
- **'అంతరించిపోతున్న సినిమా హాళ్లను కాపాడండి'**



**హైదరాబాద్, వెలుతురు మే 12 :** తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. చిత్ర బృందాలు ఏ జీవో తెచ్చుకున్నా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరలు పెంచబోమని స్పష్టం చేసింది. ఇది ప్రేక్షకులకు ఇచ్చే భరోసా అని తెలంగాణ ఎగ్జిబిటర్లు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో 'అంతరించిపోతున్న సినిమా హాళ్లను కాపాడండి' అన్న నినాదంతో ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఎగ్జిబిటర్లు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు. ప్రస్తుతం సింగిల్ స్క్రీన్ థియేటర్లు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని, అంతరించిపోతున్నాయని ఎగ్జిబిటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పర్సంటేజీ విధానంలో సినిమాలు విడుదల చేస్తేనే సింగిల్ స్క్రీన్లు బతికి ఉంటాయని గత ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ప్రెస్ మీట్ నిర్వహించారు. నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ శిరీష్ మాట్లాడుతూ, "మేం పర్సంటేజీ విధానం గురించి మాట్లాడుతున్నామంతే. ఇది ఎగ్జిబిటర్ల బతుకు పోరాటం. ఏ సినిమాని గానీ, ఏ నిర్మాతను గానీ ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశం మాకు లేదు. థియేటర్లను రక్షించండి. మిగిలిన రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లకు పర్సంటేజీ విధానం అమలు చేస్తుంటే, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఎందుకు రెంటల్ పద్ధతిలో సినిమాలు విడుదల చేస్తున్నారో ప్రశ్నించుకోవాలి" అని అన్నారు. చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ, "నిర్మాత తండ్రి అయితే ఎగ్జిబిటర్ బిడ్డలాంటివాడు. అలా చూసినప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది. గత 20 ఏళ్లుగా ఎగ్జిబిటర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది నుంచి పరిస్థితి మరింత దిగజారింది. సునీల్ నారంగ్, శిరీష్ తదితరులు థియేటర్ల అభివృద్ధి కోసం తమ బాధ్యత నిర్వర్తిస్తున్నారు. నిర్మాతగా వారికి నా సపోర్ట్ ఉంటుంది. ప్రస్తుతం ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతల మధ్య సమన్వయం చాలా ముఖ్యం" అని పేర్కొన్నారు. సునీల్ నారంగ్ మాట్లాడుతూ, "పర్సంటేజీ విధానం అమలు చేస్తామని చెబుతారు కానీ అమలు చేయరు. నిర్మాతలు కూడా నష్టాల్లోనే ఉన్నారు. మల్టీప్లెక్సులు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తుంటే, సింగిల్ స్క్రీన్ థియేటర్లు అలాంటి సదుపాయాలు కల్పించలేకపోతున్నాయి. డాల్బీ లాంటి సౌకర్యాలు ఉంటే ప్రేక్షకులు సింగిల్ స్క్రీన్లకు కూడా వస్తారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతపడితే నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లకే నష్టం. మేం ఎవరినీ టార్గెట్ చేయడం లేదు. చాలా ఏళ్లుగా ఈ విషయం నిర్మాతల దృష్టికి తీసుకెళ్తున్నాం. హామీలు ఇస్తున్నారు కానీ నెరవేర్చడం లేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ శ్రీధర్ మాట్లాడుతూ, "మేము థియేటర్లు బంద్ చేస్తున్నామని అసత్య ప్రచారం చేశారు. మేం థియేటర్లు బంద్ చేయడం లేదు. ఎవరైతే పర్సంటేజీ ఇస్తారో వాళ్ల సినిమాలను ప్రదర్శిస్తామని చెబుతున్నాం. గీత, శ్రీ వేంకటేశ్వర, సురేష్ ప్రొడక్షన్స్, ఏషియన్ లాంటి సంస్థలు ఇప్పటికే ఈ విధానంలోకి వచ్చాయి. మిగిలినవారు కూడా త్వరలో వస్తారని ఆశిస్తున్నాం. మాకు ఎవరితోనూ శత్రుత్వం లేదు" అని స్పష్టం చేశారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లు తెలుగు సినిమా పరిశ్రమకు వెన్నుముక. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఇవి మాత్రమే ప్రేక్షకులను చేరుకుంటాయి. మల్టీప్లెక్సులు పెరిగినా, సింగిల్ స్క్రీన్లు మూతపడితే సినిమా వ్యాప్తి, వసూళ్లు, ప్రేక్షకుల సంఖ్య తగ్గుతాయని ఎగ్జిబిటర్లు హెచ్చరించారు. గత ఏళ్లలో ఎన్నో సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూతపడ్డాయి. మిగిలినవి కూడా నష్టాల్లో నడుస్తున్నాయి. పర్సంటేజీ విధానం అమలు చేస్తే థియేటర్ యజమానులు, నిర్మాతలు రెండు వర్గాలు లాభపడతాయని ఎగ్జిబిటర్లు వాదించారు. సినిమా సూపర్ హిట్ అయితే ఎగ్జిబిటర్ ఎక్కువ లాభం పొందుతాడు, ఫ్లాప్ అయితే నిర్మాత నష్టపోకుండా ఉంటాడు. ఇది పరస్పర లాభదాయకమని వారు అన్నారు.

ఈ సమావేశంలో స్టార్ హీరోలు, ప్రముఖ నిర్మాతలకు విజ్ఞప్తి చేస్తూ ఎగ్జిబిటర్లు, "మీ సినిమాలు విజయం సాధించాలంటే సింగిల్ స్క్రీన్ థియేటర్లు బలంగా ఉండాలి. మా బాధలు అర్థం చేసుకుని పర్సంటేజీ విధానానికి మద్దతు ఇవ్వండి" అని కోరారు. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ఈ నిర్ణయం తెలుగు సినిమా ఇండస్ట్రీలో కొత్త చర్చను రేపుతోంది. సమన్వయంతో ముందుకు సాగాలని అందరూ ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ అంశంపై త్వరలోనే మరిన్ని చర్చలు జరగనున్నాయి.

# ఫోన్‌పేలో కొత్త ఏఐ ఫీచర్..!

- నిమిషాల్లోనే పేమెంట్ గేట్‌వే సెటప్ చేసే అవకాశం
- కోడింగ్, టెక్నికల్ సెటప్ అవసరం తగ్గించి చిన్న వ్యాపారులకు సులభమైన డిజిటల్ పేమెంట్స్
- ఏఐ ద్వారా ఆటోమేటిక్ ఏపీఐ ఇంటిగ్రేషన్, ఎరర్ హ్యాండ్లింగ్‌తో వేగవంతమైన సేవలు




హైదరాబాద్, వెలుతురు మే 12

డిజిటల్ పేమెంట్స్ సంస్థ ఫోన్ పే చిన్న, మధ్య తరహా వ్యాపారులకు ఉపయోగపడే కొత్త ఏఐ ఆధారిత టూల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఫీచర్‌తో వ్యాపారులు చాలా తక్కువ సమయంలోనే తమ వెబ్‌సైట్ లేదా యాప్‌కు ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వేను జోడించుకోవచ్చు. ఇప్పటి వరకు పేమెంట్ గేట్‌వే ఏర్పాటు చేయాలంటే కోడింగ్, ఏపీఐ ఇంటిగ్రేషన్, టెక్నికల్ సెటప్ వంటి పనులకు ఎక్కువ సమయం పట్టేది. కొన్నిసార్లు వారాల పాటు కూడా వేచి చూడాల్సి వచ్చేది. అయితే కొత్త ఏఐ టూల్‌తో కొన్ని నిమిషాల్లోనే పేమెంట్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చని కంపెనీ తెలిపింది. ఈ ఏఐ సిస్టమ్ వ్యాపార అవసరాలను అర్థం చేసుకుని, అవసరమైన ఏపీఐ లు మరియు టెక్నికల్ సెటప్‌ను ఆటోమేటిక్‌గా ఎంపిక చేస్తుంది. దీంతో ప్రత్యేక టెక్నికల్ టీమ్ లేకపోయినా చిన్న వ్యాపారులు సులభంగా డిజిటల్ చెల్లింపులను ప్రారంభించగలుగుతారు. అలాగే ఈ టూల్ ఎరర్ హ్యాండ్లింగ్, టెక్నికల్ సమస్యల సరిదిద్దడం వంటి పనులను కూడా స్వయంగా నిర్వహిస్తుంది. దీంతో డెవలపర్ల పని భారం తగ్గి, వ్యాపారాలు తమ సేవల అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో మరిన్ని ఏఐ ఆధారిత ఫీచర్లను తీసుకురావాలని ఫోన్ పే యోచిస్తోంది. డిజిటల్ పేమెంట్స్ రంగంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని కంపెనీ భావిస్తోంది.

# నీట్ విధానమే పెద్ద కుంభకోణం..!

- నీట్ రద్దు చేసి పాత అడ్మిషన్ విధానం తీసుకురావాలి : స్టాలిన్ విమర్శలు



చెన్నై వెలుతురు మే 12

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ నీట్ పరీక్షా విధానంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈసారి కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావడంతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక ఆందోళనకు గురయ్యారని అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో ప్రతి దశలోనూ అక్రమాలు కనిపిస్తున్నాయని, అసలు నీట్ విధానమే పెద్ద కుంభకోణంగా మారిందని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ప్రతి ఏడాది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పన్నెండో తరగతి మార్కుల ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానాన్ని మళ్లీ అమలు చేయాలని సూచించారు. అలాగే తమిళనాడులో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కూడా నీట్‌కు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరి తీసుకోవాలని కోరారు. గతంలో తమ ప్రభుత్వం నీట్ మినహాయింపు కోసం చేసిన న్యాయపరమైన పోరాటాన్ని విజయ్ ప్రభుత్వం కొనసాగించాలని స్టాలిన్ సూచించారు.

# రబీ 2025-26 మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణ పై ముఖ్యమంత్రి సమీక్ష





రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 12:

మంగళవారం రబీ 202526 మక్కజొన్న కొనుగోలు మరియు వరి ధాన్యం సేకరణపై గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, దనసరి అనసూయ, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు తో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో బాధ్యత, జవాబుదారీతనం స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలన్నారు. ధాన్యం రవాణా వేగవంతం చేయడానికి రవాణా శాఖ కమిషనర్ సహకారంతో మరిన్ని వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలి, హమాలీలను అవసరమైన సంఖ్యలో నియమించి, వారికి తగిన పారితోషికం చెల్లించాలని సూచించారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనులు వేగంగా జరిగేలా చూడాలి, ప్రతి కొనుగోలు కేంద్రానికి బాధ్యతాయుత అధికారిని నియమించి, పూర్తి బాధ్యత కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను రప్పించకుండా స్థానిక హమాలీల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మిల్లర్ల నుంచి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. లారీలపై మాత్రమే ఆధారపడకుండా, సమీప ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ట్రాక్టర్లను కూడా వినియోగించాలని అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాలలో మరిన్ని టార్పాలిన్లను ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్రత్యేక అధికారిని నియమించి, అవసరమైతే పోలీసు శాఖ సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా అధికారులు ప్రతిరోజూ కొనుగోలు ప్రక్రియపై నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రతిరోజూ సమీక్షిస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, పనుల్లో జాప్యం జరిగితే లేదా రైతులు ఆందోళనలు చేపడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలన్నారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలి, ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దు, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దు, ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్ ను ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందేనని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదన్నారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలి. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్ ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలి. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్ కు తరలించేలా ప్రణాళి కలుండాలి. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలి. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్ కు రిపోర్ట్ పంపించాలి. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుండి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, పిడి డీఆర్డీఏ శ్రీలత, డీసీసీఓ సుధాకర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముస్తలపల్లి లో రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రారంభోత్సవానికి అతిధి గా పీసీసీ చీఫ్

- - ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు, నాయకులు





**హన్మకొండ, మే 12 (వెలుతురు):** దామెర మండలం ముస్తలపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా అమ్మవారికి టీపీసీసీ చీఫ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొల్లం లక్ష్మణ్-మంజు దంపతులు నిర్మించిన దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీపీసీసీ చీఫ్‌కు డప్పు వాయిద్యాలతో ఆలయ అర్చకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, నాగరాజు, డీసీసీ అధ్యక్షులు అయూబ్, వెంకట్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆదాయ వనరుల పెంపుపై స్థానిక సంస్థలు దృష్టి సారించాలి రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు.





రంగారెడ్డి జిల్లా వెలుతురు మే 12:

దక్షిణ తెలంగాణా జిల్లాల స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సులో పాల్గొనడానికి మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం భవనానికి చేరుకున్న రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య కు, సభ్యులకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. అనవసర వ్యయాన్ని తగ్గించుకుని, ఆదాయ వనరుల ద్వారా రాబడిని పెంచుకున్నప్పుడే స్థానిక సంస్థల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మంగళవారం రంగారెడ్డి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో దక్షిణ తెలంగాణా స్థానిక సంస్థల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి కాత్యాయని, సభ్యుడు ఎస్.సుధీర్ రెడ్డిలతో కలిసి చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, దక్షిణ తెలంగాణా జిల్లాల నుండి విచ్చేసిన అదనపు కలెక్టర్లు తమ తమ జిల్లాలలో స్థానిక సంస్థల పని తీరు గురించి చైర్మన్ కు వివరించారు. నగర పాలక సంస్థలు, మున్సిపల్ పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపు కోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న రాబడి తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల ప్రజలను కూడా ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వాములు చేస్తూ, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతుల మెరుగుదలకు స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ఆదాయ వనరులు అభివృద్ధి చేసుకుని, పల్లె, పట్టణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం శాస్త్రీయ దృక్పథంతో పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. చైతన్యవంతమైన సమాజ నిర్మాణం జరిగి, అన్ని వర్గాల వారు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ఆర్థిక సంఘం ధ్యేయమని చైర్మన్ స్పష్టం చేశారు. ఆర్థిక అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు సమసిపోయి, మానవ సంపద, వారి శక్తియుక్తులు సమాజానికి ఉపయోగపడేలా కృషి జరగాలన్నారు. ఈ దిశగా ప్రజలకు, ప్రభుత్వానికి కమిషన్ వారధిగా నిలుస్తూ సామాజిక అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఫైనాన్స్ కమిషన్ సూచనలు చేస్తుందని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులలో ప్రతి నివాస గృహానికి రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా, పారిశుధ్య నిర్వహణ పక్కాగా కొనసాగేలా స్థానిక సంస్థలు నిశిత పర్యవేక్షణ చేయాలన్నారు. ఇటీవలే కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, మేయర్లు, చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, స్థానిక సంస్థల బలోపేతంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. నిధుల కోసం పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఆధారపడకుండా స్థానికంగా ఆదాయం సమకూర్చే అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుము వసూలు చేస్తూ స్థానిక సంస్థలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా కృషి చేయాలని అన్నారు. స్థానిక సంస్థలలో ఆదాయం వనరులు పెంపొందించుకునేందుకు గల అవకాశాలపై ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి సలహాలు స్వీకరించారు. వీటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని చైర్మన్ సిరిసిల్ల రాజయ్య వెల్లడించారు. ఈ సదస్సులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కిరణ్మయి, దక్షిణ జిల్లాల అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, జి.ఫణీంద్ర రెడ్డి, రంగారెడ్డి జిల్లా జెడ్పీ సీ.ఈ.ఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కమిషనర్ లు, డిపిఒలు, డీఎల్పీఓలు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలి: మంత్రి సీతక్క



హైదరాబాద్ వెలుతురు మే 12

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుంచి 31 వరకు నిర్వహించనున్న మహిళా వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జీవనోపాధి కార్యక్రమాలు, ఆర్థిక స్వావలంబన చర్యలు ప్రజలకు స్పష్టంగా తెలియజేసేలా వారోత్సవాల కార్యక్రమాలు ఉండాలని సూచించారు. ప్రతి రోజు భిన్న రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలను చాటి చెప్పే విధంగా షెడ్యూల్ రూపొందించాలన్నారు. కనీసం 4 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణానికి శంకు స్థాపన జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖలపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ దానకిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యుల విజయగాథలను ప్రజల ముందుకు తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి అవకాశాలు, మహిళల నాయకత్వ వికాసం, సామాజిక మార్పు వంటి అంశాలను ప్రతిబింబించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం చేతుల మీదుగా మహిళా సాధికారత, మహిళా విజయాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని మంత్రి సమీక్షించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, వ్యవసాయ అనుబంధ, వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి, వ్యాపార అవకాశాల కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. మహిళలను ఉద్యోగార్థులుగా కాకుండా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 63 లక్షలకు పైగా మహిళలు స్వయం సహాయక సంఘాల్లో భాగస్వాములై ఉన్నారని, దేశంలోనే అతిపెద్ద మహిళా ఆధారిత అభివృద్ధి వ్యవస్థగా తెలంగాణ నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల క్రెడిట్ లింకేజ్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత రెండేళ్లలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజ్ సాధించడం ద్వారా మహిళల ఆర్థిక భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. వ్యక్తిగత మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. వడ్డీ లేని రుణాల పథకం ద్వారా పేద కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం లభిస్తోందని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ హయంలో నిలిచిపోయిన వడ్డీ లేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభించామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 4.38 లక్షల సంఘాలకు రూ.1400 కోట్లు విడుదల చేసి దాదాపు 48 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ మొత్తాన్ని రెట్టింపు చేస్తామని వెల్లడించారు. మహిళా సంఘ సభ్యులకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లోన్ భీమా', 'ప్రమాద భీమా' పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని మంత్రి తెలిపారు. సభ్యురాలి మరణం సంభవించినప్పుడు రూ.2 లక్షల వరకు రుణ భీమా రక్షణ అందిస్తున్నామని, ఇప్పటివరకు 2,993 క్లెయిమ్‌లకు రూ.23.72 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రమాద మరణాలపై రూ.10 లక్షల భీమా అందించే ప్రమాద భీమా పథకం కింద 228 క్లెయిమ్‌లకు రూ.22.28 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళల ఆధ్వర్యంలో 2.36 లక్షల సూక్ష్మ వ్యాపార యూనిట్లు ఏర్పాటు కావడం ద్వారా రూ.4,166 కోట్లకు పైగా ఆర్థిక కార్యకలాపాలు జరిగాయని మంత్రి వివరించారు. జిల్లా సమాఖ్యల కోసం రూ.110 కోట్లతో 22 ఇందిరా మహిళా శక్తి భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న 222 క్యాంటీన్లు ఒక్కో యూనిట్‌కు నెలకు సగటున రూ.72 వేల లాభం ఆర్జిస్తూ 4 నుంచి 5 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పారు.

# అమరావతికి కిమ్స్

అమరావతి వెలుతురు మే 12:

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో, మరో అంతర్జాతీయ స్థాయి వైద్య సంస్థ ఇక్కడ కొలువుదీరనుంది. దేశవ్యాప్తంగా అత్యాధునిక వైద్య సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన కృష్ణా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) గ్రూప్ ఇప్పుడు అమరావతిలో తన సామ్రాజ్యాన్ని విస్తరించబోతోంది. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు సమీపంలో సుమారు 25 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోబోతున్న కిమ్స్ ఆసుపత్రి, మెడికల్ స్కిల్ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు భూమిపూజ చేయనున్నారు. ఇప్పటికే రాజధానిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి పనులు వేగంగా సాగుతుండగా, ఇప్పుడు కిమ్స్ కూడా తోడవ్వడంతో అమరావతి రాబోయే రోజుల్లో దేశంలోనే ఒక ప్రముఖ వైద్య హబ్‌గా మారబోతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాజధాని అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కేటాయించిన భూముల్లో ప్రైవేటు పెట్టుబడులు వెల్లువెత్తడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు చేకూర్చనుంది.అమరావతి నిర్మాణ ప్రక్రియలో కేవలం ప్రభుత్వ భవనాలే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రైవేటు సంస్థలు రావడం రాజధాని వైభవాన్ని మరింత పెంచుతోంది. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న కిమ్స్ సంస్థ, రాజధాని ప్రాంతంలోని ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని మరింత చేరువ చేసేందుకు సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు కోసం నిడమర్రు ప్రాంతంలో సీఆర్డీఏ కేటాయించిన 25 ఎకరాల్లో వినూత్నంగా నిర్మాణాలను చేపట్టనున్నారు. ఇందులో 23 ఎకరాలను 'కిమ్స్ బైసర్ స్కిల్ వర్సిటీ' కోసం కేటాయించగా, మిగిలిన 2 ఎకరాల్లో అత్యాధునిక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించనున్నారు. ఈ ఆసుపత్రిని ప్రారంభంలో 500 పడకల సామర్థ్యంతో నిర్మించి, దశలవారీగా 1000 పడకలకు పెంచాలని సంస్థ నిర్ణయించింది. కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా, వైద్య రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేసేందుకు ఈ స్కిల్ యూనివర్సిటీ ఎంతో దోహదపడనుంది. నిర్మాణ పనులకు సంబంధించి కిమ్స్ యాజమాన్యం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సీఆర్డీఏ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.50 లక్షల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన ధరను చెల్లించి, భూమిని స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు సీఆర్డీఏ అధికారులతో ఒప్పందాలు కూడా పూర్తయ్యాయి. బుధవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ నిర్వహించనుండటంతో, స్థానిక యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఈ ప్రాజెక్టును వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల కాలంలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనేది కిమ్స్ గ్రూప్ ప్రధాన లక్ష్యం. విజయవాడ బైపాస్ మరియు జాతీయ రహదారికి అత్యంత సమీపంలో ఈ ఆసుపత్రి నిర్మించబోతుండటం వల్ల, రవాణా పరంగా రోగులకు ఎంతో వెసులుబాటు కలుగుతుంది.

## నీట్ పేపర్ లీక్ – ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షను రద్దు చేయడం అత్యంత దురదృష్టకరం. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే కాకుండా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రాధన్ గారి నిర్లక్ష్యానికి నిదర్శనమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ శర్మ విమర్శించారు.మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాలు, వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి, లక్షల రూపాయలు ఖర్చు చేసి, సంవత్సరాల పాటు కోచింగ్ తీసుకుని పరీక్షలు రాస్తే — భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం మాత్రం "ప్రపంచగురు" అంటూ గొప్పలు చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. 22 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశ చరిత్రలో ఒకప్పుడు బీహార్ రాష్ట్రంలో మాత్రమే ఎక్కువగా పరీక్షా పేపర్ లీక్ ఘటనలు వినిపించేవని, కానీ గత 12 సంవత్సరాల బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా కేంద్ర సంస్థలకు సంబంధించిన ఉద్యోగ పరీక్షలు, NEET, UPSC వంటి కీలక పరీక్షల్లో పేపర్ లీకులు లేదా అవకతవకలు సాధారణమైపోయాయని అన్నారు.

ధర్మేంద్ర ప్రాధన్ గారు తన పనితీరుకు నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ 12 ఏళ్ల బీజేపీ పాలనలో ప్రముఖ నాయకులు, ఉన్నత వర్గాలు, వ్యాపారవేత్తల పిల్లలు విదేశాల్లో హాయిగా చదువుకుంటున్నారని, కానీ దేశంలోని మధ్యతరగతి మరియు పేద కుటుంబాల పిల్లల భవిష్యత్తు మాత్రం నాశనం అవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పరీక్షను కూడా పేపర్ లీక్ కాకుండా నిర్వహించలేని కేంద్ర ప్రభుత్వం "విశ్వగురు" అని చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. అసలు ప్రశ్న ఏమిటంటే — పేపర్ లీక్ మాఫియాలకు ఇంత ధైర్యం ఎలా వస్తోంది? వాళ్లకు చట్టం, ప్రభుత్వం అంటే భయం ఎందుకు లేదని ప్రశ్నించారు. బీజేపీ వారిని రక్షిస్తోందేమో అన్న అనుమానం ప్రజల్లో పెరుగుతోందన్నారు.దేశ భవిష్యత్తైన విద్యార్థుల భవిష్యత్తు పణంగా పడుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం రోడ్‌షోలతో బిజీగా ఉన్నారని విమర్శించారు. మధ్యతరగతి కుటుంబాల పిల్లలు ప్రజా రవాణాల్లో తిరుగుతూ, ఎన్నో కష్టాలు పడుతూ చదువుకుంటే, వారి భవిష్యత్తుతో ఆటలాడటం దారుణమన్నారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక పరీక్ష పేపర్ లీక్ పేరుతో రద్దు కావడం వల్ల యువతకు ఉద్యోగాలు రాకుండా, వైద్య విద్యార్థులు ముందుకు సాగకుండా పరిస్థితులు సృష్టిస్తున్నారని అన్నారు. జీవితంలో స్థిరపడేందుకు సిద్ధంగా ఉన్న యువతను నిరాశ, ఆవేదన వైపు నెడుతున్నారని పేర్కొన్నారు. ఒకవైపు "బేటీ బచావో, బేటీ పడావో" అంటూనే, మహిళల భద్రత విషయంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితులపై తెలంగాణ యువత ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. పరీక్షల కోసం ఎంతో కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థుల పరిస్థితి ఏమిటి? లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ, నిద్రాహారాలు మాని కష్టపడుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు. నిజంగా బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సుస్థిర పాలన అందించాలనుకుంటే, ముందుగా ధర్మేంద్ర ప్రాధన్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ఇలాంటి ఘటనలు జరిగినా ప్రజలు మతం, కులం పేర్లతో మభ్యపడి బీజేపీకి మద్దతు ఇస్తే భవిష్యత్తులో ఇంకా ఘోర పరిస్థితులు ఎదురవుతాయని హెచ్చరించారు. దేశ భవిష్యత్తు కొందరి వ్యాపారవేత్తల చేతుల్లో కీలుబొమ్మలా మారుతోందని విమర్శించారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ఈ అంశంపై సమగ్ర చర్చ జరగాలని, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల నుంచి చైతన్యం రావాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ శర్మ కోరారు.

## పేపర్ లీకేజి తో.. నీట్ రద్దు పట్ల రాహుల్ ఆగ్రహం

న్యూఢిల్లీ, మే 12 (వెలుతురు):



ప్రశ్నాపత్రం లీక్ కారణంగా నీట్ పరీక్ష రద్దు కావడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని లక్షల మంది కష్టాన్ని, కలల్ని బీజేపీ ప్రభుత్వం ఛిద్రం చేసిందని విమర్శించారు.ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, యువత భవిష్యత్తును కాలరాసే నేరమని ఆరోపించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీ ఓ ట్వీట్ చేశారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మందికి పైగా విద్యార్థుల కష్టం, తల్లిదండ్రుల త్యాగాలు, ఎన్నో కుటుంబాల ఆశలు ఈ అవినీతి పాలన వల్ల నాశనమయ్యాయని రాహుల్ గాంధీ అన్నారు. కొంతమంది తండ్రులు అప్పులు చేశారని, తల్లులు తమ నగలు అమ్మారని, లక్షలాది మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివారని, అయితే పేపర్ లీకులు, ప్రభుత్వ నిర్లక్ష్యం, విద్యా వ్యవస్థలో అవినీతి వారికి శాపంలా మారాయని విమర్శించారు. ప్రతిసారి పేపర్ మాఫియా తప్పించు కుంటోందని, నిజాయతీగా చదివిన విద్యార్థులే శిక్ష అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కష్టం కాదు.. డబ్బు, పరిచయాలే భవిష్యత్తును నిర్ణయిస్తే విద్యకు అర్థమేంటి? ప్రధాని చెప్పే అమృత కాలం దేశ యువతకు విష కాలంగా మారింది' అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని, పరీక్షల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా రాహుల్ డిమాండ్ చేశారు.

# చంచల్ గూడలో తెలంగాణ జైలు మ్యూజియం ప్రారంభం





(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కారాగార పరిపాలన చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఒకప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా జైళ్లు ప్రధానంగా శిక్షా కేంద్రాలుగా ఉండేవని, ఖైదీలు తీవ్రమైన శారీరక, మానసిక కష్టాలు అనుభవించేవారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా అలాంటి కఠినమైన జైలు విధానాలు కొనసాగినట్లు గుర్తు చేశారు. అయితే కాలక్రమేణా జైలు వ్యవస్థలు శిక్షా కేంద్రాల నుంచి సంస్కరణ, పునరావాసం, మానవీయత, గౌరవం కలిగిన మార్పు కేంద్రాలుగా రూపాంతరం చెందాయని చెప్పారు. ఆ పరిణామ క్రమాన్ని తెలంగాణ జైలు మ్యూజియం అద్భుతంగా ప్రతిబింబిస్తోందన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని రూపకల్పన చేసి అమలు చేసిన తెలంగాణ కారాగార శాఖను గవర్నర్ అభినందించారు. ముఖ్యంగా తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ & కరెక్షనల్ సర్వీసెస్ సౌమ్య మిశ్రా మరియు ఆమె బృందాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. మ్యూజియం కేవలం చారిత్రక వస్తువుల సమాహారం మాత్రమే కాకుండా, న్యాయం, శిక్ష, సంస్కరణ మరియు మానవీయ మార్పు యొక్క జీవంతమైన చరిత్రగా నిలుస్తుందని గవర్నర్ తెలిపారు. పెయింటింగ్ గ్యాలరీలు, పాత జైలు బ్యారక్కుల నమూనాలు, గొలుసులు, సంకెళ్లు, ఉరికంబాలు, అరుదైన జైలు వస్తువులు, ఆడియోవిజువల్ ప్రదర్శనల ద్వారా పూర్వకాల జైలు జీవితం మరియు ఆధునిక సంస్కరణాత్మక జైలు వ్యవస్థల పరిణామాన్ని ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. "ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్ / జైల్ అనుభవం" కార్యక్రమం ద్వారా ప్రజలకు జైలు జీవితం, క్రమశిక్షణ, ఖైదీల పరిస్థితులు, కారాగార పరిపాలనపై అవగాహన పెరుగుతుందని గవర్నర్ తెలిపారు. ఇది చట్టాల పట్ల గౌరవం, బాధ్యత, మానవీయత మరియు సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, జైలు పరిశ్రమలు, వ్యవసాయం, పునరావాస కార్యక్రమాలు, సమాజంలో పునఃకలయిక వంటి రంగాల్లో తెలంగాణ కారాగార శాఖ చేపడుతున్న సంస్కరణాత్మక చర్యలను అభినందించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సౌమ్య మిశ్రా తెలంగాణ జైలు మ్యూజియాన్ని అవగాహన, విద్య, పరిశోధన, చారిత్రక అధ్యయనం కోసం సమగ్ర కేంద్రంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జైలు మ్యూజియం పాత భవనాలు దెబ్బతినడంతో మూసివేయాల్సి వచ్చిందని, అనంతరం ఆధునిక రూపంలో చంచల్గూడలో కొత్త మ్యూజియాన్ని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ప్రాచీన శిక్షా విధానాల నుంచి ఆధునిక సంస్కరణాత్మక కారాగార వ్యవస్థల వరకు జరిగిన పరిణామాన్ని వివిధ గ్యాలరీలు, పాత జైలు నమూనాలు, చారిత్రక వస్తువులు, శిక్షా విధానాల ప్రదర్శనలు, పునరావాస కార్యక్రమాల ద్వారా మ్యూజియం చూపిస్తోందన్నారు. నాగార్జునసాగర్ ఆనకట్ట నిర్మాణ సమయంలో 1961 నుంచి 1968 వరకు ఖైదీలు ఓపెన్ ఎయిర్ జైల్లో ఉండి దేశ నిర్మాణంలో చేసిన సేవలను మ్యూజియంలోని ప్రత్యేక విభాగంలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

"జైల్ అనుభవం / ఫీల్ ది జైల్ ఎక్స్పీరియన్స్" కార్యక్రమం ద్వారా ప్రజలకు 24 గంటలు లేదా 12 గంటల చెల్లింపు ఆధారిత జైలు అనుభవం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఇందులో జైలు వసతి, జైలు భోజనం, క్రమశిక్షణ, రోజువారీ కార్యకలాపాలు, నియంత్రిత జైలు జీవన విధానం ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమం వినోదం కోసం కాకుండా అవగాహన, సహానుభూతి, బాధ్యత, మానవీయ విలువలు మరియు కారాగార సంస్కరణలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మ్యూజియం మరియు అనుబంధ కార్యక్రమాలు ప్రజా అవగాహన, జైలు సంస్కరణలు, పునరావాస కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవడమే కాకుండా పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాలు, ఖైదీల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధికి కూడా దోహదపడతాయని తెలిపారు. ప్రజల సందర్శనల కోసం మరియు ఆన్లైన్ స్లాట్ బుకింగ్స్ కోసం అధికారిక వెబ్‌సైట్ telanganajailexperience.com ను ప్రారంభించినట్లు తెలిపారు. సందర్శకుల కోసం కేఫెటీరియా సౌకర్యం కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మరిన్ని వివరాలు, బుకింగ్స్ కోసం telanganafeelthejail@gmail.com ఈమెయిల్ లేదా +91 94946 32046 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐజీ ప్రిజన్స్ ఎన్. మురళీ బాబు, డీఐజీలు డాక్టర్ డి. శ్రీనివాస్, ఎం. సంపత్, సూపరింటెండెంట్లు ఎన్. శివకుమార్ గౌడ్, డి. భరత్, జి. ప్రమోద్, టి. లక్ష్మీ శ్రీనాథ్, ఎస్. శ్రీనివాస రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది, ఆహ్వానితులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జూన్ 2న ఆదిలాబాద్ లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం

హైదరాబాద్, మే 12 (వెలుతురు) :




రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి సూచన మేరకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడతను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్ ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, శాసన మండలిలో చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్**

2 బిహెచ్ కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్ధిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్దిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పిడిలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశించారు.

**అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదు**

అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్ సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని , స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరిశ్రమలు ఐటి శాఖలు, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం ముఖ్యమైనదన్నారు. ఇది చాల పకడ్బందీగా అమలవుతున్నదని ఈ పథకాన్ని ఇదే విధంగా ముందుకు తీసుకెళ్లాలని, పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పేదరికమే అర్హతగా లబ్దిదారుల ఎంపిక చేపడుతున్నామని ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదని స్పష్టం చేశారు. తాము ఎలాంటి భేషజాలకు పోవడం లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. కలెక్టర్లు ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. శాసనసభ స్పీకర్ జి. ప్రసాద కుమార్ మాట్లాడుతూ శాసనసభలో తీసుకున్న నిర్ణయం మేరకు సమావేశాలు నిర్వహించడం పట్ల మంత్రికి అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా గొప్పగా అమలు అవుతున్నదని, జిల్లా స్థాయిలో కలెక్టర్లు ప్రతివారం ఈ పథకాన్ని సమీక్షించి పేదలకు మేలు కలిగేలా చూడాలన్నారు.

# నన్ను కెలికారు... కన్న పేగును క్షోభ పెడుతున్నారు

- నా కుటుంబానికి పెట్టిన నిప్పంటించారు
- ఆ నిప్పు వాళ్లనే దహించి వేయబోతోంది
- తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు
- తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే
- కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం
- కరీంనగర్ "హిందూ ఏక్తా యాత్ర"లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- బండి సంజయ్ హిందూ ధర్మ పరిరక్షకుడు
- సంజయ్ కు అండగా నిలవాలంటూ హిందువులకు హంపి పీఠాధిపతి పిలుపు
- ఏక్తా యాత్రకు జన ప్రభంజనం
- కరీంనగర్ కాషాయ మయం
- జన సంద్రమైన కరీంనగర్ వీధులు
- కాషాయ శ్రేణుల జోష్...హిందుత్వ వాదుల నినాదాలతో ముందుకు సాగుతున్న ఏక్తా యాత్ర
- వినూత్న రీతిలో కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న హిందూ ఏక్తా యాత్ర









కరీంనగర్ వెలుతురు మే 12

''ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్టానికి కట్టుబడి ఉన్నా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ''సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా సమాజం కోసమే పనిచేసిన. ఏ ఇంట్లో కష్టమొచ్చినా పెద్ద కొడుకునై అండగా ఉన్నా. కానీ కొడుకుకు టైమివ్వలేకపోయా. జరుగుతున్న పరిణామాలకు తప్పు నాదే. క్షమించండి'' అని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేశారు. జీవితాంతం నా బాటలోనే నడిచిన నా భార్య కార్యకర్తలకు ఏ కష్టమొచ్చి నా చేతనైనంత సాయం చేసిందని, ఈరోజు కన్న పేగునే క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను భయపడేది లేదని స్పష్టం చేసిన బండి సంజయ్ ''నన్ను కెలికారు. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహించి వేస్తా. అవినీతి గడీలను బద్దలు కొడతా''అని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున సాయంత్రం కరీంనగర్ లోని వైశ్యాభవన్ నుండి ''హిందూ ఏక్తా యాత్ర'' ప్రారంభమైంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ఏక్తా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఈ యాత్రకు తరలివచ్చారు. వేలాది మంది కాషాయ శ్రేణులతో కరీంనగర్ జన సంద్రమైంది. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండి సంజయ్ ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఈ లైట్ల ఫోకస్ ఎక్కువైంది. నేను మాట్లాడుతుంటే లైట్ల కాంతికి కళ్లల్లో నీళ్లు వస్తే ఏడుస్తున్నానని అనుకునేరు. నేను భయపడ. బండి సంజయ్ కంట తడి పెట్టే రకంకాదు. టవర్ సర్కిల్ పై కాషాయ జెండాను ఎగరేశాం. కరీంనగర్ ప్రజలకు హ్యాట్సాఫ్. హిందువుల ఐక్యతను చాటేందుకే 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర చేస్తున్నా. జై శ్రీరాం అనే నినాదమే హిందూ ధర్మాన్ని కాపాడుతుంది. హిందూ సమాజానికి ఆపదొస్తే జై శ్రీరాం నినాదంతో తెగించి కొట్లాడతాం.

కరీంనగర్ గడ్డ రక్తం నాలో ప్రవహిస్తుంది. కరీంనగర్ లో గల్లీగల్లీలో ప్రజా సమస్యలపై కొట్లాడిన. చిన్న కార్యకర్తగా మొదలైంది నా ప్రస్తానం. నా జీవితం కష్టాలు, బాధలే. బాధలను చూసి భయపడి పారిపోయేటోడ్ని కాను.

మీరే నా కుటుంబం. సమాజమే నా ఇల్లు అనుకున్న. హార్ట్ లో స్టంట్ ఉన్నా హార్ట్ ఫుల్ గా 1600 కి.మీలు నడిచిన. తెలంగాణ ప్రజల కష్టాలను పంచుకున్న. నాటి పాలకులు నాపై రాళ్ల దాడి చేసినా, 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలే. ఏ హిందువుకు ఆపదొచ్చినా అండగా ఉన్నా. మీ ఇంట్లో పెద్ద కొడుకునైన. నా టైమంతా సమాజానికే ఇచ్చిన. నా కొడుకుకు టైమియ్యలేకపోయిన. నా కొడుకును క్రిమినల్ గా చూపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. అయినా నా కొడుకును నేను సమర్ధించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. నా భార్య సైతం నన్ను ఫాలో అవుతోంది. నేనున్నా లేకున్నా కార్యకర్తలకు చేతనైనంత సాయం చేస్తోంది. ఈరోజు నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతి వ్యవస్థను దగ్ధం చేస్తా. అవినీతి, కుట్రలు చేసే గడీల బద్దలు కొడతా. నన్ను, నా కుటుంబాన్ని, నా కార్యకర్తలను ఇబ్బంది పెట్టినోడిని విడిచి పెట్టే ప్రసక్తే లేదు.

బండి సంజయ్ భయపడే ప్రసక్తే లేదు. కాషాయ జెండా పట్టి కష్టాలు పడుతూనే ఉన్నా. అయినా బాధపడను.. ధర్మం కోసం పోరాడుతూనే ఉన్నా. నా కొడుకుకు టైమివ్వకుండా నేను తప్పు చేసిన. తప్పు నాదే.... నన్ను క్షమించండి. తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు... నిరూపించుకోవాలని చెప్పిన. నా చివరి శ్వాస వరకు హిందూ ధర్మం కోసమే పనిచేస్తా. ఇయాళ నా కొడుకుపై జరుగుతున్న దాడిని చూసి కన్నపేగు తల్లడిల్లుతోంది. నా కొడుకు సంఘటన మమ్ముల్ని ఇబ్బంది పెడుతుంటే... 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటుంటే ఆ కుటుంబాలు పడుతున్న క్షోభ గుర్తుకొస్తోంది. శ్రీరామ చంద్రుడికే కష్టాలు తప్పలేదు. శ్రీరామచంద్రుడే నాకు ఆదర్శం. కష్టాలు భరిస్తా. ఆనాడు రాక్షసులు ఆంజనేయస్వామికి నిప్పంటిస్తే ఏమైంది? లంకా దహనమైంది. నేను హనుమంతుడి భక్తుడిని. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతికి పాల్పడుతూ కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహనం చేస్తా. అవినీతి గడీలను కూల్చివేస్తా. వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

## అమరావతిలో ప్రజాప్రతినిధులకు నివాసాలు

- త్వరలోనే జీఏడీకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు
- రాజధాని అమరావతిలో శరవేగంగా భవన నిర్మాణ పనులు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లను పరిశీలించిన మంత్రి నారాయణ
- తుది దశకు చేరుకున్న మంత్రుల బంగ్లాలు, అధికారుల నివాసాలు
- 12 టవర్లలో 288 ఫ్లాట్లు.. అత్యాధునిక వసతులతో నిర్మాణం
- నిర్మాణ పనుల కోసం రూ. 524.70 కోట్ల నిధులు మంజూరు
- రాజధాని భూములపై అసత్య ప్రచారాలను ఖండించిన మంత్రి
- దీర్ఘకాలిక అవసరాలకు అనుగుణంగా భవనాల రూపకల్పన
- కృష్ణా నది తీరాన ముఖ్యమంత్రి నివాసం, రాజ్ భవన్ ఏర్పాటు




అమరావతి వెలుతురు మే 12

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల కోసం నిర్మిస్తున్న నివాస సముదాయాల పనులు చివరి అంకానికి చేరుకున్నాయి. ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్వయంగా క్షేత్రస్థాయిలో నిర్మాణాలను పరిశీలించి, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం కేటాయించిన భవనాల్లో సివిల్ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇంటీరియర్ పనులు ముగియగానే వీటిని సాధారణ పరిపాలన శాఖకు (జీఏడీ) అప్పగిస్తామని ఆయన వెల్లడించారు. మంత్రుల బంగ్లాలు, గ్రూప్1, గ్రూప్2 అధికారుల నివాస టవర్లు కూడా ముగింపు దశలో ఉన్నాయని, కాంట్రాక్టు సంస్థలు మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అమరావతిలో జరుగుతున్న ఈ భారీ నిర్మాణాల గురించి పొరుగు రాష్ట్రాల్లో కూడా చర్చ జరుగుతోందని, ఇది ఏపీ అభివృద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతుల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇప్పటివరకు 34,525 ఎకరాలకు సంబంధించి రైతులకు ప్లాట్లు కేటాయించామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కేవలం 674 మందికి మాత్రమే కొన్ని న్యాయపరమైన చిక్కుల వల్ల ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని, త్వరలోనే ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం అమరావతిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, భూములు తీసుకుని ప్లాట్లు ఇవ్వలేదని ప్రచారం చేసేవారు వాస్తవాలు తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. రాజధానిపై జరుగుతున్న రాజకీయ కుట్రలను ప్రజలు నమ్మవద్దని కోరారు. నిర్మాణ రంగంలో ఎక్కడా రాజీ పడకుండా, అత్యుత్తమ నాణ్యతతో ఈ భవనాలను నిర్మిస్తున్నామని, ఇవి దేశంలోనే అత్యుత్తమ నివాస సముదాయాలుగా నిలుస్తాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఈ నివాస సముదాయాల విశేషాలను పరిశీలిస్తే, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీల కోసం మొత్తం 12 టవర్లను నిర్మిస్తున్నారు. వీటిలో మొత్తం 288 ఆధునిక ఫ్లాట్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి ఫ్లాట్‌ను అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ నివాస సముదాయ ప్రాంగణంలోనే క్లబ్ హౌస్, అత్యాధునిక ఆసుపత్రి, స్విమ్మింగ్ పూల్ వంటి వసతులు ఉండనున్నాయి. పర్యావరణ హితంగా ఈ భవనాలను రూపొందిస్తున్నారు. సోలార్ ఎనర్జీ వినియోగం, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్), మురుగునీటి శుద్ధి ప్లాంట్లు వంటి పర్యావరణ అనుకూల వసతులు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. భద్రత విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అధునాతన సెక్యూరిటీ సిస్టమ్‌స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. భవన నిర్మాణాలను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 524.70 కోట్ల మేర పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. గతంలో నిలిచిపోయిన అంతర్గత విద్యుత్ పనులు, లిఫ్టుల ఏర్పాటు, ఫైర్ ఫైటింగ్ సిస్టమ్స్, ప్లంబింగ్ మరియు ల్యాండ్‌స్కేపింగ్ పనుల కోసం ఈ నిధులను కేటాయించారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కూడా గతంలో ఈ పనులను పరిశీలించి కీలక సూచనలు చేశారు. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే పెరిగే సభ్యుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని, ఈ భవనాలను దీర్ఘకాల అవసరాలకు తగ్గట్టుగా నిర్మించాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి చైర్మన్ల నివాసాలకు ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూడాలని సూచించారు. కృష్ణా నది ఒడ్డున ముఖ్యమంత్రి అధికారిక నివాసం, రాజ్ భవన్ వంటి కీలక కట్టడాలు రానున్నాయని, రాజధాని అమరావతి భవిష్యత్తులో ప్రపంచ స్థాయి నగరంగా విరాజిల్లుతుందని స్పీకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..!

- వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యుల నియామకం
- జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల



**హైదరాబాద్, మే 12 (వెలుతురు):** ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డుకు కొత్త సభ్యులను నియమిస్తూ చంద్రబాబు సర్కార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం2019 ప్రకారం ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కలెక్టర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది. విశాఖపట్నం కలెక్టర్‌ను ఆంధ్ర ప్రాంతానికి ప్రతినిధిగా నియమించగా, తిరుపతి కలెక్టర్‌ను రాయలసీమ ప్రాంతానికి ప్రతినిధిగా నియమించింది. ఈ నిర్ణయం ద్వారా ప్రాంతీయ స్థాయిలో ట్రాన్స్‌జెండర్ సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

***ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం..***

ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డులో నామినేట్ సభ్యులుగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం కల్పించింది. కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్క జీవన్ కుమారి, బోను దుర్గలను బోర్డు సభ్యులుగా నియమించింది. ఈ నియామకాల ద్వారా ట్రాన్స్‌జెండర్లకు సంబంధించిన సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి వెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, నియమిత సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ నియామకాలు అమల్లో ఉంటాయని ఏపీ సర్కార్ స్పష్టం చేసింది.

జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల

మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల చేసింది. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది

***ట్రాన్స్‌జెండర్ సంక్షేమానికి ప్రాధాన్యం***

రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో మరింత సహకారం అందించేందుకు చర్యలు చేపడుతోంది. ట్రాన్స్‌జెండర్ హక్కుల పరిరక్షణ చట్టం2019 అమల్లో భాగంగా సంక్షేమ బోర్డు కీలక పాత్ర పోషించనుంది. సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సమాన హక్కులు, గౌరవం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుపై

***రాయపాటి శైలజ హర్షం..***

ట్రాన్స్‌జెండర్ వెల్ఫేర్ బోర్డుకు సభ్యులను నియమించడంపై ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ హర్షం వ్యక్తం చేశారు. ఈరోజు(మంగళవారం) అమరావతి వేదికగా శైలజ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులు, సంక్షేమంపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను మే 4వ తేదీన మంత్రి నారా లోకేశ్ దృష్టికి తాను తీసుకెళ్లానని ప్రస్తావించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయడం కూటమి సర్కారు చిత్తశుద్ధికి నిదర్శనమని రాయపాటి శైలజ పేర్కొన్నారు.

## జూన్‌లో ప్రారంభం కానున్న సనత్‌నగర్ టిమ్స్

హైదరాబాద్ వెలుతురు మే 12

జూన్ నెలలో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రస్తుతం ట్రయల్ రన్ విజయవంతంగా కొనసాగుతోందని చెప్పారు. కొన్ని ఫినిషింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, అవి కూడా గడువులోగా పూర్తవుతాయని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రిలో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను మంగళవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా పరిశీలించారు. ఆస్పత్రిలోని A, B, C బ్లాకులను సందర్శించిన మంత్రి ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబ్‌లు, మెకనైజ్‌డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర విభాగాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి ఆదేశించారు. ఆస్పత్రికి నీరు, విద్యుత్ సరఫరా 24 గంటలు నిరంతరంగా ఉండేలా చూడాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, అన్ని అంతస్తుల్లో మరోసారి పూర్తి స్థాయి తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, కన్సల్టేషన్ రూమ్స్, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్, ఫార్మసీ కౌంటర్ల సంఖ్యను పెంచాలని సూచించారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ వంటి అత్యాధునిక యంత్రాలను పరిశీలించిన మంత్రి.. పేషెంట్లకు పూర్తిస్థాయిలో సేవలు అందేలా అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. ఈ ఆస్పత్రి 1000 బెడ్ల సామర్థ్యంతో నిర్మితమవుతోందని, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే అత్యాధునిక ఆస్పత్రిగా టిమ్స్‌ను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలకు



ఈ ఆస్పత్రిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే ఇక్కడ ఆధునిక రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com